

విశాఖకు మరో వందేభారత్ రైలు

- భువనేశ్వర్ లేదా ఖుర్దా రోడ్డు నుంచి రాకపోకలు
- 12న ప్రధాని చేతులు మీదుగా ప్రారంభం



విశాఖ స్టేషన్‌కు చేరిన కొత్త వందేభారత్ రైలు

... మెయిన్ 12లో

మార్మోగిన శివనామం



ఆర్కేబీచ్‌లో టీఎస్సార్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాకుంభాభిషేకంలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి, టి.సుబ్బిరామిరెడ్డి తదితరులు

భక్తి శ్రద్ధలతో మహా శివరాత్రి

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పంచాక్షరి నామంతో ఆలయాలు మార్మోగాయి. ఆర్కే బీచ్‌లో కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బిరామిరెడ్డి ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి ప్రారంభించారు. మహా శివలింగాన్ని దర్శించేందుకు, జాగరణ అనంతరం సముద్ర స్నానాలు ఆచరించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వెల్లువలా తరలివచ్చారు. దీంతో తీరమంతా జనంతో కిక్కిరిసిపోయింది.



ఎంవీపీ కాలనీ పార్వతీ ముక్తేశ్వర ఆలయంలో శివలింగాలకు అభిషేకం చేస్తున్న భక్తులు

మహా డ్రామా

చైన్‌మెన్ వ్యవస్థను రద్దు చేస్తూ ఏడాది కిందట జీవీఎంసీ కౌన్సిల్‌లో తీర్మానం

- ఇప్పటికీ అమలు చేయని అధికారులు
- తమకు అస్మదీయులైన వారిని కొనసాగించాల్సిందిగా పాలకవర్గం పెద్దల ఆదేశం
- నైట్ ఫుడ్‌కోర్టు విషయంలోనూ అదే పరిస్థితి
- ఏడాదైనా అక్కడ నుంచి ఇప్పటికీ తొలగించని వైనం
- దిగజారుతున్న కౌన్సిల్ ప్రతిష్ఠ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)





గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలో ఎటువంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలన్నా కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి. కౌన్సిల్‌లో సభ్యులు చర్చించి తీర్మానం చేస్తే...దానిని సంబంధిత అధికారులు తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుంది. కానీ తాజా పాలకవర్గం హయాంలో మాత్రం అందుకు భిన్నమైన సంప్రదాయం మొదలైంది. కౌన్సిల్‌లో చేసిన తీర్మానాల్లో కొన్ని ఏళ్లు గడిచినా అమలుకు నోచుకోవడం లేదు. అందుకు కౌన్సిల్‌లోని కొందరు పెద్దలే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జీవీఎంసీ ప్రస్తుత పాలక వర్గంలో 97 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో మెజారిటీ సభ్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు చెందినవారు కావడంతో మేయర్, డిప్యూటీ మేయర్ వంటి పదవులను ఆ పార్టీకి చెందినవారే దక్కించుకున్నారు. కౌన్సిల్‌లో మెజారిటీని ఆసరాగా తీసుకుని పాలక వర్గంలో వైసీపీకి చెందిన కొంతమంది పెద్దలు బరితెగించి వ్యవహరిస్తున్నారు. తమకు ప్రయోజనం ఉంటుందనుకుంటే ఎటువంటి అంశాన్నైనా కౌన్సిల్‌లో పెట్టి ఏకపక్షంగా ఆమోదించేసుకుంటున్నారు. మేయర్‌తో తీర్మానం చేయించేస్తున్నారు. ఆ తర్వాత దానివల్ల ప్రభావితం అయ్యే వర్గాలు...వారిని కలిసి ప్రసన్నం చేసుకుంటే తీర్మానాలను అమలు చేయొద్దంటూ సంబంధిత విభాగాల అధికారులను ఆదేశిస్తున్నారు. ఉదాహరణకు చైన్‌మెన్ వ్యవస్థ రద్దు, పాతజైలురోడ్డులోని నైట్‌ఫుడ్‌కోర్ట్ తొలగింపు అంశాలను పేర్కొనవచ్చు.

టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఉండే చైన్‌మెన్ తమ పరిధిలో భవన నిర్మాణదారుల వద్దకు వెళ్లి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చైన్‌మెన్ వ్యవస్థ కారణంగా తరచూ టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఫిర్యాదులు అందుతున్నాయని ఏడాది కిందట జరిగిన కౌన్సిల్ సమావేశంలో స్వయంగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఆక్షేపించారు. వార్డు సచివాలయ వ్యవస్థలో భాగంగా ప్లానింగ్ సెక్రటరీలు అందుబాటులోకి వచ్చినందున చైన్‌మెన్ వ్యవస్థ అవసరం లేదని అభిప్రాయపడ్డారు. తక్షణం చైన్‌మెన్ వ్యవస్థను రద్దు చేస్తున్నట్టు తీర్మానం చేశారు. అప్పటికే చైన్‌మెన్‌లుగా పనిచేస్తున్న 50 మంది సేవలను ఇతర విభాగాల్లో అవసరమైన చోట వినియోగించుకోవాలని ఆదేశించారు. అయితే ఏడాది గడిచిపోతున్నా ఇప్పటికీ చైన్‌మెన్ వ్యవస్థ కొనసాగుతోంది. 50 మందిలో 14 మంది తాము పర్మనెంట్ చైన్‌మెన్‌లమని తమను కొనసాగించాలంటూ పాలక వర్గం పెద్దలను కలిసి ప్రసన్నం చేసుకున్నారు. దాంతో వారిని యథావిధిగానే కొనసాగించాలని అధికారులను ఆదేశించినట్టు సమాచారం. ఇక మిగిలిన 36 మందిని ఇతర చోట్ల నుంచి డెప్యూటేషన్‌పై వచ్చారంటూ అప్పట్లో ఆయా విభాగాలకు పంపించేశారు. తర్వాత వారిలో కొందరు పాలకవర్గం పెద్దలను కలిసి ముడుపులు సమర్పించుకోవడంతో తిరిగి చైన్‌మెన్‌గా నియమించేయడం విశేషం. అలాగే ట్రాఫిక్ సమస్యతోపాటు పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యలోపం తలెత్తుతున్నందున పాతజైలు రోడ్డులోని నైట్ ఫుడ్‌కోర్టును అక్కడి నుంచి తొలగించాలని ఏడాది కిందట కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. ఇప్పటికీ ఫుడ్‌కోర్టు అక్కడే కొనసాగుతోంది. దీనిని బట్టి కౌన్సిల్ తీర్మానాలకు పాలకవర్గం ఎంత విలువ ఇస్తున్నదో అర్థం అవుతున్నదని పలువురు కార్పొరేటర్లు, అధికారులు పేర్కొంటున్నారు. సాక్షాత్తూ కౌన్సిల్‌లో చేసిన తీర్మానాలనే పట్టించుకోకపోతే ఇంకా ఆ సమావేశాలకు ఏం విలువ ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. తమకు నచ్చితే ఒకలా...నచ్చకపోతే మరొకలా వ్యవహరించడం ద్వారా పాలకవర్గంలో కొందరు పెద్దలు కౌన్సిల్ విలువను దిగజార్చుతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

చేతులు కలిపిన ఉద్దండులు!

దాడి వీరభద్రరావు నివాసానికి కొణతాల రామకృష్ణ

- జిల్లాలో మారనున్న రాజకీయ సమీకరణాలు

సుదీర్ఘకాలం రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న దాడి, కొణతాల



దాడి వీరభద్రరావు నివాసంలో కొణతాల రామకృష్ణ తదితరులు

ఒకరు తెలుగుదేశం, మరొకరు కాంగ్రెస్..

- 1999 ఎన్నికల్లో తొలిసారి ముఖాముఖి పోటీ
- దాడి వీరభద్రరావు గెలుపు
- 2004 ఎన్నికల్లో మరోసారి తలపడిన దిగ్గజాలు
- ఈసారి కొణతాలను వరించిన విజయం
- 2014లో ఇద్దరూ వైసీపీలో... అయినా ఎవరిదారి వారిదే
- అనంతరం పార్టీ నుంచి బయటకు వచ్చిన నేతలు
- ఇటీవల టీడీపీ గూటికి వీరభద్రరావు, జనసేన పార్టీలో చేరిన రామకృష్ణ...
- వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనేది నానుడి. దశాబ్దాల రాజకీయ వైరాన్ని పక్కనపెట్టి అనకాపల్లి జనసేన అభ్యర్థి, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ శుక్రవారం టీడీపీకి చెందిన మాజీ మంత్రి, సీనియర్ నేత దాడి వీరభద్రరావు ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలవడం ఇందుకు నిదర్శనం. సుదీర్ఘకాలం పాటు ఉత్తర, దక్షిణ ధ్రువాలుగా వున్న ఈ ఇద్దరు రాజకీయ ఉద్దండులు చేతులు కలపడంతో అనకాపల్లితో పాటు జిల్లావ్యాప్తంగా రాజకీయ సమీకరణలు మారతాయని భావిస్తున్నారు.

అధ్యాపక వృత్తి నుంచి సుమారు నాలుగు దశాబ్దాల క్రితం తెలుగుదేశం పార్టీలో చేరిక ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన దాడి వీరభద్రరావు 1985లో తొలిసారి అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. అప్పట్లో కొణతాల రామకృష్ణ కుటుంబం బెల్లం వ్యాపారంలో ఉండేది. 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దాడి వీరభద్రరావు రెండోసారి పోటీ చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత ద్రోణంరాజు సత్యనారాయణ ప్రోత్సాహంతో కొణతాల రామకృష్ణ కాంగ్రెస్ పార్టీలో చేరి అనకాపల్లి నుంచి లోక్‌సభకు పోటీ చేశారు. వీరభద్రరావు ఎమ్మెల్యేగా, రామకృష్ణ ఎంపీగా గెలుపొందారు. అప్పటి నుంచి రాజకీయ ప్రత్యర్థులుగా కొనసాగుతూ వచ్చారు. తరువాత 1991లో లోక్‌సభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ... మిగతా 6వ పేజీలో

కొణతాల విజయం కోసం పనిచేస్తాం

- దాడి వీరభద్రరావు ప్రకటన
- వైసీపీని ఓడించేందుకు టీడీపీ, జనసేన శ్రేణులు కలిసి పనిచేయాలని పిలుపు
- కూటమి గెలుపే లక్ష్యం: కొణతాల -6లో

ఉత్తుత్తి బ్యాంకు

ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల నుంచి లోన్స్ ఇప్పిస్తామంటూ ఎర

- ఎవరైనా ఆసక్తి చూపితే ఖాళీ చెక్‌లు తీసుకుంటున్న వైనం
- లోన్ ప్రాసెసింగ్ ఫీజు అంటూ రూ.20 వేలు ముందే వసూలు
- నెలలు గడిచినా మంజూరుకాని రుణాలు



- ఎవరైనా గట్టిగా నిలదీస్తే డబ్బు త్వరలో తిరిగి ఇచ్చేస్తామంటూ సమాధానం
- చెప్పడమే తప్ప ఇవ్వడం లేదంటున్న బాధితులు
- రాష్ట్రవ్యాప్తంగా ఏజెంట్లను నియమించుకుని దందా

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"నగరానికి చెందిన ఒక ట్రావెల్స్ నిర్వాహకుడి వద్దకు ఇటీవల ఒక యువకుడు వెళ్లాడు. ద్వారకానగర్‌లోని ఒక బ్యాంకు పేరు చెప్పి, అందులో తాను ఏజెంట్‌గా పనిచేస్తున్నానని పరిచయం చేసుకున్నాడు. సొంత ఇల్లు ఉంటే మార్టిగేజ్ లోన్ ఇప్పిస్తానన్నాడు. దీంతో సదరు ట్రావెల్స్ నిర్వాహకుడు తనకు డబ్బు అవసరమని లోన్ కావాలని చెప్పడంతో ఇంటి డాక్యుమెంట్లు, 15 ఖాళీ చెక్‌లతోపాటు ప్రాసెసింగ్ ఫీజు పేరుతో రూ.20 వేలు తీసుకున్నాడు. ఏడాది గడిచినా లోన్ రాకపోవడంతో ట్రావెల్స్ నిర్వాహకుడు...తాను ఫోన్ పే చేసిన నంబర్‌కు కాల్ చేశాడు. అతను చెప్పిన బ్యాంకు (చూడడానికి కార్యాలయం మాదిరిగా ఉంటుంది)కు వెళ్లి నిలదీశాడు. డబ్బులు వెనక్కి ఇచ్చేస్తామంటూ చెప్పారు. రెండు వారాలైంది. 14 చెక్‌లు వెనక్కి ఇచ్చారు. మరో చెక్, రూ.20 వేలు మాత్రం ఇవ్వడం లేదు. రేపు, మాపు అని చెబుతున్నారు."

...సదరు బ్యాంకు బాధితులు నగరంలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నట్టు తెలిసింది.

నగరంలోని ద్వారకా నగర్‌లో బ్యాంకు పేరుతో ఒక కార్యాలయం ఏర్పాటుచేశారు. ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల నుంచి హోమ్‌లోన్స్, మార్టిగేజ్ లోన్స్, ఎన్ఆర్ఐ హోమ్ లోన్స్ ఇప్పిస్తామంటూ పెద్ద బోర్డు పెట్టారు. సంస్థ పేరు బ్యాంక్ అని పేర్కొన్నప్పటికీ హోమ్స్ లోన్స్ ప్రాసెసింగ్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్ అంటూ తమకు అన్ని అనుమతులు ఉన్నాయంటూ కార్యాలయంలో ఫొటో ఫ్రేమ్‌లు ఏర్పాటుచేశారు. సంస్థ తరపున రాష్ట్రంలోని చిన్న, మధ్యతరగతి పట్టణాలు, నగరాల్లో తమ శాఖలు ఏర్పాటుచేశారు. కస్టమర్లను గుర్తించేందుకు వీలుగా ఏజెంట్లను కూడా ఏర్పాటుచేసుకున్నారు. ఏజెంట్లు తమకు తెలిసిన వ్యాపారులు, ఉద్యోగులు, ఆస్తులు ఉండి ఆర్థిక ఇబ్బందులు కలిగి ఉన్నవారిని కలుస్తారు. తమ సంస్థకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు బ్యాంకులతో అవగాహన ఒప్పందం ఉందని చెబుతుంటారు. సొంతంగా ఆస్తులు ఉంటే వాటిపై లోన్స్ ఇప్పిస్తామంటూ ముగ్గులోకి లాగుతున్నారు. గతంలో తీసుకున్న రుణాలను ... మిగతా 6వ పేజీలో

160 మంది సచివాలయ కార్యదర్శులకు నోటీసులు

- 'విజన్ విశాఖ' కార్యక్రమానికి విద్యావేత్తలుగా, పారిశ్రామిక ప్రతినిధులుగా హాజరుకావాలంటూ అధికారుల ఆదేశం
- సకాలంలో వెళ్లలేదనే కారణంతో కక్ష సాధిస్తున్నారని ఉద్యోగుల ఆరోపణ
- విధులు సరిగా నిర్వర్తించనందుకు వివరణ కోరానంటున్న జోన్ కమిషనర్

జ్ఞానాపురం, మార్చి 8: ఒకవైపు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ, మరోవైపు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ...అధికారులు చెబుతున్న పనులన్నీ చేస్తున్నా చిన్నచిన్న కారణాలు చూపి నోటీసులు ఇస్తున్నారని జోన్-5 సచివాలయ కార్యదర్శులు వాపోతున్నారు. విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదంటూ జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ శుక్రవారం ఏకంగా 160 మందికిపైగా కార్యదర్శులకు నోటీసులు జారీచేశారు. ఈ నోటీసులకు 21వ తేదీలోగా వివరణ అందజేయాలని, లేకుంటే మార్చి నెల జీతాలు నిలిపివేస్తామని పేర్కొన్నారు. కార్యదర్శుల కథనం ప్రకారం... ఈనెల ఐదో తేదీన నగరంలోని రాడిసన్ హోటల్‌లో జరిగిన 'విజన్ విశాఖ' కార్యక్రమానికి విద్యావేత్తలుగా, పారిశ్రామిక ప్రతినిధులుగా హాజరుకావాలని సచివాలయ కార్యదర్శులను అధికారులు ఆదేశించారు. ఆ సమావేశానికి సకాలంలో హాజరుకాకపోవడంతో కక్ష సాధింపు చర్యగా శుక్రవారం నోటీసులు జారీ చేశారని వారు ఆరోపిస్తున్నారు. సమావేశానికి ఆలస్యం కావడంపై ఆదేరోజు జోనల్ కమిషనర్‌కు వివరణ ఇచ్చినట్టు తెలిపారు.ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసే యోచనలో సచివాలయ కార్యదర్శులు ఉన్నట్టు తెలుస్తుంది.

బయోమెట్రిక్ నమోదు చేయనందుకే నోటీసులు: జోన్-5 కమిషనర్ కృష్ణ

సచివాలయ ఉద్యోగులు బయోమెట్రిక్ నమోదు చేయకపోవడంతోనే ... మిగతా 6వ పేజీలో

సంక్షోభంలో ఉక్కు

- ఈ నెల 8వ తేదీకి కూడా అధికారులకు అందని వేతనాలు
- ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పని వైనం
- నల్ల బ్యాడ్జీలతో నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు పరిస్థితి రోజురోజుకూ తీసికట్టుగా తయారవుతోంది. జిందాల్ స్టీల్ సాయంతో మూడో బ్లాస్ట్ ఫర్నేసులో ఉత్పత్తి ప్రారంభించినా ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేకపోతోంది. ప్రతి నెలా జీతాలు చివరి 30, 31 తేదీల్లోనే ఇవ్వడం ఆనవాయితీ. కానీ ఆర్థిక సమస్యల వల్ల ఇటీవల ఆలస్యం జరుగుతోంది. ఈ నెల మరీ ఘోరంగా 8వ తేదీ వచ్చినా అధికారులకు జీతాలు ఇవ్వలేదు. ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పకపోవడం మరో విశేషం.

ప్లాంటులో కార్మికులు, ఉద్యోగుల వేతనాలకు నెలకు రూ.86 కోట్లు (చెరో రూ.43 కోట్లు) అవసరం. కార్మికులకు జీతాలు సకాలంలో ఇవ్వకపోతే ఆందోళన చేస్తారని ఏదో తిప్పలు పడి వారికి సర్దుబాటు చేస్తున్నారు. అదే అధికార వర్గాలైతే ఆందోళనలు, ధర్నాలు చేయకూడదు కాబట్టి, నోరెత్తరని వారికి అన్నీ చూసుకొని కాసింత ఆలస్యంగా ఇస్తున్నారు. ప్లాంటు పరిస్థితి బాగా లేనందున వారు కూడా సర్దుకుపోతున్నారు. అయితే ఈ నెల 8వ తేదీ దాటినా అధికారులు ఎవరికీ జీతాలు ఇవ్వలేదు. తొమ్మిదో తేదీ రెండో శనివారం. పదో తేదీ...ఆదివారం. అంటే పదకొండో తేదీ సోమవారం కూడా ఇస్తారో లేదో తెలియదు. జీతాలపై ఆధారపడి జీవించేవారికి ఒకటో తేదీ రాగానే చెల్లించాల్సిన బకాయిలు అనేకం ఉంటాయని, ఇలా జీతాలు ఆలస్యం ఎలా అంటూ అధికార వర్గాలు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశాయి. తక్షణమే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశాయి.

టౌన్‌షిప్‌లో యూనిట్ విద్యుత్‌కు రూ.8

ఉక్కు టౌన్‌షిప్పుల్లో నివాసం ఉండే వారికి విద్యుత్ చార్జీలు చాలా స్వల్పం. యూనిట్‌కు 50 పైసలు మాత్రమే తీసుకుంటారు. దేశంలోని అన్ని ప్లాంట్లలో అలాగే ఉంది. ఇక్కడ కూడా ఆరు నెలల క్రితం వరకూ అలాగే ఉండేది. ఇప్పుడు ఆర్థిక స్థితి బాగా లేదని యూనిట్‌కు రూ.8 చొప్పున వసూలు చేస్తున్నారు. దాంతో భారీగా విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు పెద్ద పేరుందని వేరే ప్లాంట్లలో ఉద్యోగాలు వచ్చినా వెళ్లకుండా ఇక్కడే చేరామని, ఇప్పుడు జీతాలు ఇవ్వలేని దుస్థితికి చేర్చారని ఉద్యోగులు వాపోతున్నారు. తక్షణమే విశాఖపట్నం స్టీల్ ప్లాంటును సెయిల్‌లో విలీనం చేసి ఆదుకోవాలని అధికారులు డిమాండ్ చేశారు.

'విశాఖ దక్షిణ టికెట్ ముస్లింలకు కేటాయించాలి'



అల్లిపురంలో నిరసన తెలుపుతున్న ముస్లిం పెద్దలు

అల్లిపురం, జగదాంబ, మార్చి 8: రానున్న ఎన్నికల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గం అసెంబ్లీ టికెట్ ముస్లింసామాజిక వర్గానికి కేటాయించాలని ముస్లిం మత పెద్దలు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం జుమా నమాజ్ అనంతరం అల్లిపురంలోని మసీద్ ఏ ఫిర్దోస్ వద్ద, వన్‌టౌన్ ఏరియా చంగల్రావుపేటలోని జామియా మసీదు ఆవరణలో టికెట్ కేటాయించాలంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా మసీద్ ఏ ఫిర్దోస్ కమిటీ అధ్యక్షుడు మహబూబ్ షరీఫ్ మాట్లాడుతూ.. విశాఖ జిల్లా వ్యాప్తంగా జనాభాలో రెండో స్థానంలో ఉన్న ముస్లింలకు చట్టసభలలో సరైన స్థానాన్ని ప్రధాన రాజకీయ పార్టీలు కల్పించకపోవడం దారుణమని విమర్శించారు. దక్షిణ నియోజకవర్గ పరిధిలో 25వేల ముస్లిం ఓటర్లు ఉన్నారని, ఈ స్థితిలో ఈ టికెట్ తమ సామాజికి వర్గానికి కేటాయించాలని డిమాండ్‌చేశారు. లేని పక్షంలో ముస్లిం నేతలు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తారని హెచ్చరించారు.

'శివరాత్రి రోజు తెరిచిన పాఠశాలలపై చర్యలకు సిఫార్సు'

సీతమ్మధార, మార్చి 8: మహాశివరాత్రికి ప్రభుత్వం అన్ని పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించిందని, ఈ ఆదేశాలను ధిక్కరించి నగరంలోని కొన్ని పాఠశాలలు తెరిచి తరగతులు నిర్వహించినట్టు ఫిర్యాదులు అందినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారామ్ పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు వాటిపై డీఈవోకు పరిశీలించాలని సూచించామన్నారు. జిల్లా ఉన్నత అధికారులు త్వరలో ఇచ్చిన సమాచారంపై ఆయా స్కూల్ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని సీతారామ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

26వ వార్డులో బీజేపీ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, మార్చి 8 : గ్రేటర్ 26వ వార్డు శంకువానిపాలెంలో బీజేపీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు శుక్రవారం ప్రారంభించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో తాను ఉత్తర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్టు ఈసందర్భంగా చెప్పారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటుపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీతమ్మధార మండల అధ్యక్షుడు నాగ డమూడి నానాజీ, 26వ వార్డు అధ్యక్షుడు కేవీ కుమార్, నాయకులు బొడ్డేటి రవికుమార్, రఘునాథ్, పద్మ, మాదేటి కనకారావు, కొప్పిశెట్టి శంకరరావు, గార ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో నష్టమే..

మహరాణిపేట, మార్చి 8: ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఎమ్ఐఎఫ్ ప్రతినిధి ఎం. హర్ష అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, వాటి నియంత్రణపై జిల్లా పరిషత్ సమీపాన సమావేశ మందిరంలో మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి రెండింతలు పెరగడం ఆందోళనకలిగించే విషయమన్నారు. ఇది సామాజిక, ఆర్థిక, పర్యావరణ పరిస్థితులపై ప్రభావాన్ని చూపిస్తుందన్నారు. వ్యర్థాలతో తలెత్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. పలువురు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బి. సింహాచలం నాయుడు తెలిపారు. ముస్లిం తాటిచెట్లపాలెం, ఆంధ్రజ్యోతి ఏరియా, అక్కయ్యపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.



చైతన్యనగర్‌లో పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



సీతంపేట పార్వతీశ్వరాలయంలో పాలాభిషేకం చేస్తున్న అర్చకులు

వాడవాడలా శివరాత్రి వేడుకలు

సీతమ్మధార, మార్చి 8: వాడవాడలా మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి పురస్కరించుకుని ఏకవార అభిషేకాలను ఆలయ అర్చకులు రామారావు శర్మ, మహేష్ శర్మ నిర్వహించారు. పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో అభిషేకాలను నిర్వహించారు. ఈ పూజల్లో వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, వైసీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు పాల్గొన్నారు. సీతంపేట గణేశ్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 9 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను అర్చకులు భాస్కర్‌శర్మ, శివాజీ శర్మ జరిపారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో ప్రత్యేక అభిషేకాలను జరిపారు.

కాశీ విశ్వేశ్వరుని కల్యాణం

చైతన్యనగర్-మద్దిలపాలెంలోని వినాయక, శివాలయం, షిర్డీ సాయి, అయ్యప్పస్వామి ఆలయాల సముదాయంలో సప్తాయతన ఆలయ సంఘం ఆధ్వర్యంలో దనిష్ట నక్షత్రయుత కన్యాలగ్నంలో కాశీవిశ్వేశ్వరుడు, అన్నపూర్ణాదేవి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

ప్రతి ఒక్కరూ భగవన్నామ స్మరణ చేయాలి..

డాబాగార్డెన్స్: ప్రతి ఒక్కరూ భగవన్నామ స్మరణ చేయాలని ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ దరి భగవాన్ శ్రీ సత్యానంద విశ్వవిహార్‌లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ముందుగా పరమేశ్వరునికి అభిషేకాలు, మహా మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యానంద మహర్షి జయంతిని నిర్వహించారు. మాతాజీ సునంద, శ్రీనివాసస్వామి, ఆశ్రమ ప్రతినిధులు బీవీఎస్ సత్యనారాయణ, బి. లక్ష్మణస్వామి, దాసు సోదరులు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదవితరణ చేశారు.

మురళీనగర్; మాధవధార కొండపై ఆలయం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున ఆలయంలో అర్చకులు శ్రీనివాస శర్మ పూజాభిషేకాలు, గోత్రనామాలతో పూజలు జరిపారు. రాత్రి లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. పట్టాభిరెడ్డితోటలోని శ్రీకాశీ విశ్వేశ్వర దేవస్థానం, మురళీనగర్ గౌరీ రామలింగేశ్వరాలయంలో పూజలు ఘనంగా జరిగాయి. అదేవిధంగా మురళీనగర్ బ్రహ్మకుమారీలు శాంతి ధామంలో శివ అవతరణ వేడుకలు చేపట్టారు.

శివనామస్మరణతో మార్మోగిన శైవలయాలు

జ్ఞానాపురం: జ్ఞానాపురం, అల్లిపురం ప్రాంతాల్లోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. వైర్లెస్‌కాలనీ, డీఎలస్ రైల్వే కాలనీ, అస్సాం గార్డెన్స్, అల్లిపురం మెయిన్‌రోడ్డు, జ్ఞానాపురం ఉన్న ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో..

అక్కయ్యపాలెం: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రైల్వేన్యూకాలనీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఇన్‌చార్జి శశికళ మాట్లాడుతూ శివరాత్రి ప్రాధాన్యం, ఉపవాస జాగరణల అంతరార్థాన్ని వివరించారు. ఈకార్యక్రమంలో రైల్వేన్యూకాలనీ మసీద్ ప్రెసిడెంట్ మహ్మద్ అబ్దుత్ గఫార్, గురుద్వారా ప్రధాన పూజారి జస్ప్రీత్ సింగ్, ప్రొటెక్టర్ ఆర్ఫ్ డయాసిస్ ఫాదర్ జైరాజ్, లైట్ హౌస్ , లైట్ షిప్స్ ముఖేశ్ తదితరులు పాల్గొన్నారు.దొండపర్తి ఎరుకుమాంబ ఆలయం, రామకృష్ణానగర్‌లోనిశివాలయం, జగ్గారావు బ్రిడ్జివద్ద ఉన్న గౌరీపరమేశ్వరాలయం, రైల్వేన్యూకాలనీ, కైలాసపురం, లక్ష్మీనారాయణపురం, తదితర ప్రాంతాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివునికి పూజలు చేశారు.



రైల్వే కాలనీలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు



డీఎల్ఎస్ కాలనీ శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా దుర్గాలమ్మ తొలేళ్ల ఉత్సవం

పూర్ణామార్కెట్, మార్చి 8: పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడివద్ద మహాశివరాత్రి నేపథ్యంలో శుక్రవారం తొలేళ్ల ఉత్సవం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పలు వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి అమ్మవారికి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం గుడి పరిసరాలన్నీ పూర్తిగా జనంతో కిక్కిరిసిపోయాయి. దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారు. దుర్గమ్మ మాలధారులతో పరిసరాల్లో భక్తిభావన నెలకుంది. నిప్పుల గుండం ప్రదర్శన భక్తులు ఆసక్తిగా తిలకించారు. పూర్ణామార్కెట్ వెలంపేట, రామకృష్ణా జంక్షన్, ఇందిరా స్టేడియం ఏరియా, ప్రసాద్ గార్డెన్స్ పరిసరాలన్నీ పూర్తిగా జనంతో దర్శనమిచ్చాయి. విద్యుత్ దీపాలతో పూర్ణామార్కెట్ నుంచి రామకృష్ణా రైతుబజార్‌ప్రసాద్ గార్డెన్స్ వద్ద దుర్గమ్మ పందిళ్లను శోభాయమానంగా అలకరించారు.

నీలమ్మ అమ్మవారి జాతర

అల్లిపురం, మార్చి 8: జీవీఎంసీ 33వవార్డు పరిధి అల్లిపురంలోని శ్రీనీలమ్మ అమ్మవారి జాతర శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలిపూజను ఆలయ ట్రస్ట్ చైర్మన్ బొర్రావిజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి దంపతులతో జరిపించారు. అనంతరం ఉదయం 6గంటల నుంచి 8 వరకు అమ్మవారికి ప్రత్యేక కుంకుమపూజలు, ఉదకాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాభిషేకాలు నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు భక్తులకు తాగునీటి సరఫరా, ప్రసాద వితరణ చేశారు. ఉదయం అమ్మవారిని విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి దర్శించుకుని భక్తులకు ఆశీస్సులు అందించారు. అనంతరం అమ్మవారిని ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి, కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, జనసేన నగర అధక్షుడు వంశీకృష్ణయాదవ్, బొడ్డేపల్లి రఘు,సుందరపు సతీష్‌కుమార్, మహ్మద్‌సాదిక్ తదితర ప్రముఖులు దర్శించుకున్నారు. సాయంత్రం తిరువీదుల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో రమాబాయి, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.



ఉత్సవంలో పాల్గొన్న సీతంరాజు సుధాకర్, కమిటీ సభ్యులు

మహిళలకు బాసటగా టీడీపీ: గంటా

అక్కయ్యపాలెం, మార్చి 8 :మహిళలకు బాసటగా తెలుగుదేశం ప్రభుత్వం నిలుస్తుందని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ట్విట్టర్‌లో పోస్ట్ ద్వారా తెలిపారు.. ఎక్కడ స్త్రీలు పూజలందుకుంటారో అక్కడ దేవతలు కొలువై ఉంటారన్నారు. కానీ, దేవతగా కొలవాల్సిన స్త్రీ మూర్తిపై అత్యాచార, అఘాయిత్యాలతో నేటి పరిస్థితులు ఆందోళన కలిగిస్తుందని చెప్పారు. వీటి నివారణకు అనుగుణంగా చట్టాల్లోనూ సమూల మార్పులు రావాలన్నారు. ముందుగా వనితలందరికీ ఆయన అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా సాధికారత దిశగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మరో కీలక ముందడుగు వేశారని పేర్కొన్నారు. కలలకు రెక్కలు పేరిట ఓ సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకువచ్చారన్నారు.

ఏపీలో ఏ ఆడ బిడ్డ కూడా చదువుకు సంబంధించి డబ్బుల కొరతతో ఇంటికి పరిమితం కాకూడదనే ఆలోచనతో ఈపథకం అమలు చేయనున్నారన్నారు. ఏపీలో మహిళలకు వృత్తి, విద్యకు సంబంధించి మార్గాలను అందించడంతో పాటు వారికి మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడం టీడీపీ లక్ష్యమన్నారు. మహాశక్తి పథకం ద్వారా ఇంట్లో 18 నుంచి 59 ఏళ్ల మధ్య ఉండే ప్రతి మహిళకు నెలకు రూ.15 వేలు, దీపం పథకం కింద ప్రతి మహిళకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, ప్రతి మహిళ జిల్లాలో ఎక్కడికి వెళ్లాలన్నా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని, మీ ఉన్నతికి నిరంతరం పాటు పడే టీడీపీకి ప్రతి ఆడపడుచు అండగా నిలబడాలన్నారు. పురుషులకు దీటుగా సమైక్య శక్తులుగా, సాహస మూర్తులుగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

మహిళలతోనే సమాజ పురోభివృద్ధి

- నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ అయ్యనార్
- ఘనంగా మహిళా దినోత్సవం

డాబాగార్డెన్స్, మార్చి 8: మహిళలపైనే సమాజ పురోభివృద్ధి ఆధారపడి ఉంటుందని నగర పోలీస్ కమిషనర్ డా.ఏ రవిశంకర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం కమిషనర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు.పోలీసు శాఖకు చెందిన మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోష్ని అపరంజి కొరాటి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ కే ఫక్కీరప్ప, డీసీపీ-1 వి.ఎస్.మణికంఠ,డీసీపీ పి.వెంకటరత్నం, డీడీఆఫ్ (ప్రాసిక్యూషన్స్ ఎం.శైలజా, ఏడీసీపీలు, ఏసీపీలు, మహిళా పోలీసు అధికారులు, వుమెన్ పీసీలు, హెచ్‌సీలు, మహిళా పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: మహిళా దినోత్సవం రైల్వేన్యూకాలనీలోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శాఖ ఇన్‌చార్జి శశికళ మాట్లాడుతూ స్త్రీ అంటే శక్తి స్వరూపిణి అని అన్నారు. బీజేపీ గ్రేటర్ 42వ వార్డు అధ్యక్షుడు గురుగోవింద్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం టీఎస్ఎన్ కాలనీలో నిర్వహించారు. ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.కార్యక్రమంలో జి.జ్యోతి, జి.శ్రీదేవి, త్రివేణి వర్మ, వరలక్ష్మి, రత్నం తదితరులు పాల్గొన్నారు.టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది జ్యోతిర్మయి, లీలావతి, కుమారి, ధనలక్ష్మి, సీతారత్నం, శాంతి, అనితలను సంస్థ కార్యదర్శి ప్రగడ శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఆధ్వర్యంలో తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేరులో ఉపాధ్యాయినిలకు ప్రిన్సిపాల్ కమల్‌జిత్ సత్కరించారు. రాంజీఎస్టేట్‌లో టీడీపీ నేతయాగాటి ఆదిలక్ష్మి కేక్ కట్ చేశారు.



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు

డాబాగార్డెన్స్: శ్రీ దుర్గ మహిళా చైతన్య సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పి.ఆదినారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం సిటీ సెంట్రల్ పార్కు వద్ద మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కేక్ చేశారు. అనంతరం సీనియర్ కళాకారులను సత్కరించి సన్మానించారు. ప్రెసిడెంట్ బురిడీ లత, కోశాధికారి ఎన్.వెంకటలక్ష్మి, జాయింట్ సెక్రటరీ పార్వతి, సభ్యులు భాను పాల్గొన్నారు.

జ్ఞానాపురం: గ్రేటర్ 41వ వార్డులోని కార్పొరేటర్ కార్యాలయంలో మహిళా దినోత్సవం జరిగింది. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమాను స్థానిక మహిళలు ఘనంగా సత్కరించారు. 33వ వార్డులో వార్డు టీడీపీ నాయకులు విల్లూరి చక్రవర్తి, తిరుమలాదేవి దంపతులు వెంకటేశ్వరమెట్ట వద్ద వేడుకలు నిర్వహించారు. స్థానిక సెయింట్‌జోసెఫ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు లింగసమానత్వం,మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. డా.కె.మాణిక్యకుమారి, డా.జె.నిర్మలపాల్గొన్నారు.

మహిళల్లో రాజకీయ చైతన్యం రావాలి



కేక్ కట్ చేస్తున్న సీపీ రవిశంకర్, కమిషనర్ రోష్ని అపరంజి

సీతమ్మధార: మహిళల్లో రాజకీయ చైతన్యం వస్తేనే సామాజిక, ఆర్థిక రంగాల్లో ఎదుగుదల ఉంటుందని రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు పేర్కొన్నారు. అలాగే, దళితులు రాజకీయాల్లోకి ప్రవేశించాలని ఆయన పిలుపునిచ్చారు. రామాటాకీస్ రోడ్డులో అంబేద్కర్ భవన్‌లో అంబేద్కర్ మెమోరియాల్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళా సాధికారత, ప్రభుత్వ విధానాలు అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గొల్ల బాబూరావు మాట్లాడుతూ దళితులు, మహిళలు రాజకీయంగా ఎదగాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు బి.కళ్యాణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేవీ ప్రభాకర్, వై.వసంతకుమారి, రత్న కుమారి, గార సత్యనారాయణ, ఆర్.సరస్వతి, శ్రీనివాసరావు, కాంతారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్; మురళీనగర్ వాకర్స్ అధ్యక్షుడు పల్లా.చంద్రమౌళి ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంచారు. క్లబ్ పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాధం, కమిటీ కార్యదర్శి చెల్లారాజుల చేతుల మీదుగా 40 మందికి చీరలను అందించారు.



మురళీనగరంలో వాకర్స్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ



ఏయూటీడీ వసతి గృహం సిబ్బందికి సత్కారం..



కళాకారులకు సన్మానిస్తున్న దృశ్యం



కేంద్రీయ విద్యాలయంలో ఉపాధ్యాయినిలకు..

పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీగా విజయభాస్కర్



ఆర్జేడీ విజయభాస్కర్

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ విశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులుగా సమగ్రశిక్షా అభియాన్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అకడమిక్ మోనటరింగ్ అధికారిగా ఉన్న బి. విజయ భాస్కర్‌ను నియమించారు. ఆయన స్థానంలో విశాఖ ఆర్జేడీగా పనిచేస్తున్న ఎం. జ్యోతి కుమారిని బదిలీ చేశారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల పరిధిలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల పర్య వేక్షణ, విద్యా బోధన, టీచర్ల సర్వీస్ వ్యవహారాలను ఆర్జేడీ కార్యాలయం పర్యవేక్షిస్తోంది.

చేతులు కలిపిన ఉద్దండులు!

... 5వ పేజీ తరువాయి

కొణతాల రామకృష్ణ మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. మూడేళ్ల తరువాత 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దాడి వీరభద్రరావు మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధించారు. రెండేళ్ల తరువాత 1996లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కొణతాల మూడోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడు చేతిలో ఓడిపోయారు. లోక్‌సభకు 1998లో మధ్యంతర ఎన్నికలు జరగ్గా...కాంగ్రెస్ తరపున కొణతాల పోటీ చేయలేదు. ఆయన బదులు గుడివాడ గురునాథరావు పోటీ చేసి ఎంపీగా గెలిచారు. మళ్లీ ఏడాది తిరగకుండా 1999లో లోక్‌సభ మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. ఇదే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగాయి. కొణతాల రామకృష్ణ ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీకి పోటీ చేశారు. టీడీపీ నుంచి యథావిధిగా దాడి వీరభద్రరావు పోటీ చేశారు. హోరాహోరీగా జరిగిన ఈ పోరులో 3,711 ఓట్ల మెజారిటీతో వీరభద్రరావు గెలిచారు. అప్పటి నుంచి రాజకీయ వైరం మరింత పెరుగుతూ వచ్చింది. మళ్లీ 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి దాడి, కాంగ్రెస్ తరపున కొణతాల తలపడ్డారు. ఈ ఎన్నికల్లో కొణతాల గెలుపొందగా, దాడి వీరభద్రరావు తొలిసారి ఓటమి చవిచూశారు. అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో కొణతాల వాణిజ్య, న్యాయ, ఎక్సైజ్ శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. తరువాత టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, దాడి వీరభద్రరావుకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి, శాసనమండలి పక్షనేత హోదా కల్పించారు. 2009 ఎన్నికల్లో కొణతాల కాంగ్రెస్ నుంచి, వీరభద్రరావు టీడీపీ నుంచి పోటీ చేయగా, కొత్తగా ఏర్పడిన ప్రజారాజ్యం పార్టీ తరపున గంటా శ్రీనివాసరావు పోటీ చేశారు. త్రిముఖ పోటీ జరిగిన ఈ ఎన్నికల్లో గంటా గెలుపొందారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం తరువాత ఆయన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటుచేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొణతాల రామకృష్ణ చేరారు. 2014 ఎన్నికల ముందు దాడి వీరభద్రరావు టీడీపీని వీడి వైసీపీలో చేరారు. ఇద్దరు నేతలు ఒకే పార్టీలో ఉన్నప్పటికీ ఎక్కడా ఒకే వేదికను పంచుకున్న దాఖలాలు లేవు. ఆ ఎన్నికల్లో వీరభద్రరావు తనయుడు రత్నాకర్ విశాఖ పశ్చిమ నుంచి, కొణతాల సోదరుడు రఘునాథ్ అనకాపల్లి వైసీపీ అభ్యర్థులుగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. కొంతకాలం తరువాత వైసీపీ అధినేత తీరు నచ్చక ఇద్దరూ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. టీడీపీలో చేరాలని భావించినప్పటికీ అనివార్య కారణాల వల్ల చేరలేదని రాజకీయ వర్గాల సమాచారం. దాదాపు నాలుగేళ్లపాటు రాజకీయంగా స్తబ్దుగా వున్నారు. గత ఎన్నికల ముందు దాడి వీరభద్రరావు మళ్లీ వైసీపీలో చేరారు. కొణతాల రామకృష్ణ తటస్థంగానే ఉన్నారు. అయితే అనకాపల్లి ఎంపీ అభ్యర్థి ఆడారి ఆనందకుమార్‌తోపాటు టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా కొన్నిచోట్ల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ దాడి వీరభద్రరావు కుటుంబానికి తగిన న్యాయం జరగలేదు. దీంతో ఇటీవల తన కుమారులు రత్నాకర్, జయవీర్‌లతో కలిసి దాడి వీరభద్రరావు టీడీపీలో చేరారు. ఇది జరిగిన కొద్ది రోజులకే కొణతాల రామకృష్ణ జనసేన పార్టీలో చేరారు. తరువాత టీడీపీ-జనసేన కూటమి పొత్తులో భాగంగా అనకాపల్లి సీటును జనసేనకు కేటాయించడంతో, కొణతాల రామకృష్ణను అభ్యర్థిగా ప్రకటించడం ఒకేసారి జరిగిపోయాయి. దీంతో దశాబ్దాల కాలంగా వున్న రాజకీయ వైరాన్ని పక్కన పెట్టి కొణతాల రామకృష్ణ శుక్రవారం దాడి వీరభద్రరావు ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో తనకు సహకరించాలని కోరారు. సుదీర్ఘ కాలంపాటు రాజకీయ ప్రత్యర్థులుగా వున్న ఇద్దరు ఉద్దండులు చేతులు కలపడంతో వచ్చే ఎన్నికల్లో అనకాపల్లితోపాటు పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజకీయ సమీకరణాలు మారతాయని విశ్లేషకులు అంటున్నారు.

కొణతాల విజయం కోసం పనిచేస్తాం

- దాడి వీరభద్రరావు ప్రకటన
- వైసీపీని ఓడించేందుకు టీడీపీ, జనసేన శ్రేణులు కలిసి పనిచేయాలని పిలుపు
- కూటమి గెలుపే లక్ష్యం: కొణతాల

అనకాపల్లి టౌన్, మార్చి 8:అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ శుక్రవారం సంతబయలు ప్రాంతంలో గల మాజీ మంత్రి దాడి వీరభద్రరావు నివాసానికి వెళ్లారు. ఎన్నికల్లో తనకు సహకరించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా దాడి వీరభద్రరావు మాట్లాడుతూ తమ రెండు కుటుంబాల మధ్య రాజకీయాలకు ముందు అవినాభావ సంబంధాలు ఉండేవన్నారు. రాజకీయపరమైన విభేదాలే తప్ప వ్యక్తిగత సమస్యలు ఏమీ లేవన్నారు. కొణతాల తండ్రి సుబ్రహ్మణ్యంతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో కొణతాలను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు తామంతా కలిసి పని చేస్తామని దాడి వీరభద్రరావు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా జగన్‌ను ఓడించడమే లక్ష్యంగా ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో డబ్బుతో గెలుపొందాలని వైసీపీ భావిస్తుందన్నారు. నియోజకవర్గం లేని వ్యక్తి ఉమ్మడి జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని పరోక్షంగా మంత్రి అమర్‌నాథ్‌ను విమర్శించారు. అమర్‌నాథ్‌ను తన గుండెల్లో పెట్టుకుంటానని ముఖ్యమంత్రి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, గతంలో తన కుమారుడు రత్నాకర్‌ను కూడా అదేవిధంగా గుండెల్లో పెట్టుకుంటానన్నారన్నారు. కొణతాల విజయానికి కలిసికట్టుగా పనిచేసి, రాక్షస పాలనను తరిమికొడదామన్నారు.

స్టీరింగ్ కమిటీ ఏర్పాటుచేసుకుందాం: కొణతాల

జనసేన, టీడీపీతో పాటు బీజేపీ కూడా పొత్తులోకి వస్తున్నందున అందరం కలిసి పనిచేస్తామని కొణతాల రామకృష్ణ అన్నారు. దాడి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భవిష్యత్తులో ఒక సమావేశం ఏర్పాటుచేసి స్టీరింగ్ కమిటీ నియమించుకుందామన్నారు. ఆ కమిటీ ద్వారా పనులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కష్టపడిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును జైలులో పెట్టడం శోచనీయమన్నారు. చంద్రబాబునాయుడు హయాంలో సుజల స్రవంతి ప్రాజెక్టుకు నిధులు మంజూరుచేసినా వైసీపీ ప్రభుత్వంలో మాత్రం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన విజయమే లక్ష్యంగా పనిచేసి రాష్ట్రంతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో దాడి తనయుడు ప్రభాకర్, కొణతాల సత్యనారాయణ, మళ్ల రాజా, బొడ్డేడ శంకరరావు, బొడ్డపాటి చినరాజారావు, కోటిపల్లి జేజిబాబు, కొణతాల రమణబాబు, కృష్ణఅప్పారావు, పీలా నాగశ్రీను, మళ్ల సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తుత్తి బ్యాంకు

... 5వ పేజీ తరువాయి

సక్రమంగా చెల్లించకపోవడం వల్ల బ్యాంకు ట్రాక్ రికార్డు బాగోలేకపోయినా తాము మేనేజ్ చేసి లోన్ ఇప్పించేస్తామని నమ్మబలుకుతున్నారు. వారి మాటలు నిజమేనని భావించి ఎవరైనా లోన్ తీసుకోవడానికి ఆసక్తి చూపితే వారి నుంచి ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.20 వేలు ముందుగానే లాగేసుకుంటున్నారు. తర్వాత ఆస్తికి సంబంధించిన డాక్యుమెంట్లు, లోన్ మంజూరైన తర్వాత బ్యాంకుకు నెలవారీ వాయిదాలు కట్టేందుకంటూ 15 ఖాళీ చెక్‌లను తీసుకుంటున్నారు. రూ.20 వేలు చేతిలో పడగానే అక్కడి నుంచి పత్తాలేకుండాపోతున్నారు. ఏడాది గడిచినా రుణం మంజూరవ్వదు. దీంతో కొంతమంది ఆశ వదులుకుని రూ.20 వేలు పోయిందని ఊరుకుంటున్నారు. ఫోన్‌పే ద్వారా చెల్లించిన వారిలో టెక్నాలజీ మీద అవగాహన కలిగిన కొద్దిమంది మాత్రం ఆ నంబర్ ఆధారంగా ఏజెంట్ చెప్పిన బ్యాంకు అడ్రస్ తెలుసుకుని వెళ్లి నిలదీస్తే...'మీ ట్రాక్ రికార్డు బాగోలేనందున లోన్ ఇవ్వడానికి ఏ బ్యాంకు ముందుకు రాలేదని, ప్రాసెసింగ్ ఫీజ్ కింద కొంత మినహాయించుకుని మిగిలిన మొత్తం వెనక్కి ఇచ్చేస్తామని' సమాధానం ఇస్తున్నారు. కానీ వారాలు గడిచిపోతున్నా డబ్బులు ఇవ్వడం లేదు. ఇలా నగర పరిధిలోనే కాదు...రాజమండ్రి, భీమవరం, విజయనగరం, శ్రీకాకుళం వంటి పట్టణాల్లో కూడా బాధితులు ఉన్నట్టు సమాచారం. దీనిపై పోలీసులు మేల్కొనకపోతే బాధితుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

160 మంది సచివాలయ కార్యదర్శులకు నోటీసులు

... 5వ పేజీ తరువాయి

నోటీసులు అందించినట్టు జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో పలువురు ఉద్యోగులకు సంబంధించి బయోమెట్రిక్ నమోదు కావడం లేదన్నారు. అలాగే, విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ పరిస్థితుల్లో చర్యల్లో భాగంగా నోటీసులు జారీ చేసినట్టు ఆయన చెప్పారు.

హెచ్‌ఎంఎస్ జాతీయ కమిటీ సభ్యునిగా గణపతిరెడ్డి



ఉక్కుటౌన్‌షిప్, మార్చి 8: హెచ్ఎంఎస్ యూనియన్ జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యునిగా స్టీల్‌ప్లాంట్ హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం జాతీయ కార్యవర్గం నుంచి ఉత్తర్వులు అందాయి . తనపై నమ్మకం ఉంచి జాతీయ కార్యవర్గంలో చోటు ఇవ్వటం ఆనందంగా ఉందని, కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

వైభవంగా శ్రవణా నక్షత్రం పూజలు



వేపగుంట మార్చి 8: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా శ్రవణా నక్షత్రం పూజ లు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి నాయుడుతోట చైతన్యనగర్‌కు చెందిన రామునాయుడు, లక్ష్మి, రమేష్ అనిత దంపతులు, కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం చేశారు. వీరికి అర్చకులు వెంకటేశ్వర స్వామి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆదినారాయణ, కృష్ణమూర్తి, సన్యాసిరావు, రాజేంద్ర, శ్రీహరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వీఎస్‌ఈజెడ్‌లో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

కూర్మన్నపాలెం, మార్చి 8: ఆరోగ్యం కోసం ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని లయన్స్‌క్లబ్ కూర్మన్నపాలెం అధ్యక్షులు ఎ.మురళీధర రెడ్డి, వైద్యులు చైతన్య వర్మ అన్నారు. వీఎస్‌ఈజెడ్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కూర్మన్నపాలెం ఏ ప్లస్ ఆసుపత్రి, లయన్స్ క్లబ్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత శిబిరంలో వారు మాట్లాడారు. వివిధ యూనిట్లకు చెందిన సుమారు 200 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. అనంతరం లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ల లీలారాణి, వైద్యులు పావని, శాంతి, జాన్వి, లావణ్య ఘనంగా సత్కరించారు. వైద్యులు చైతన్య వర్మ, లయన్స్ ప్రతినిధులు సుబ్బరాజు, ప్రసాద్, అవిరెడ్డి సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాసాలమ్మ ఆలయ వార్షికోత్సవం



కూర్మన్నపాలెం, మార్చి 8: జీవీఎంసీ 86వార్డు రాసాలమ్మ కాలనీలో శుక్రవారం శ్రీ రాసాలమ్మ అమ్మ వారి 12వ వార్షిక మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పత్తిపాటి శ్రీనివాసరావు, ముద్దపు మురళీ మోహన్, ముత్యాలు సుబ్బయ్య, పత్తిపాటి ప్రసాదు, రమేష్, బొడ్డ రమణ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 16, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 28, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 24, క్యాబేజి 22, క్యారెట్ 24, దొండకాయలు 24, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)7,
మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 115, బరబటి 15, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 02, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 54, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	105
ఫారం ధర	--	125
విత్ స్కిన్	--	220
స్కిన్‌లెస్	--	230

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



అగనంపూడిలో అభిషేకం చేస్తున్న భక్తులు



అప్పికొండ శివాలయంలో బారులు తీరిన భక్తులు

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

గాజువాక /ఉక్కుటౌన్‌షిప్, మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పురాతన అప్పికొండ శివాలయంలో మహాశివరాత్రి వేడుకలు అంబరాన్నంటాయి. శుక్రవారం తెల్లవారుజామున అర్చకులు తొలి పూజ చేసిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు జాగారం చేసి శనివారం ఉదయం సముద్ర స్నానాలు ఆచరిస్తారు. భారీగా జనం తరలిరావడంతో ద్విచక్ర వాహనాలు, కార్లకు కిలోమీటరు దూరంలో పార్కింగ్ సౌకర్యం కల్పించారు. బస్సులను ఆలయం వరకు అనుమతించారు. డీసీపీ సత్తిబాబు, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, దువ్వాడ సీఐ ఎర్రన్నాయుడు, ఎస్ఐల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. సముద్ర తీరం వద్ద ప్రత్యేక భద్రతను, గజ ఈతగాళ్లను, బీచ్ పెట్రోలింగ్ వాహనాలను ఏర్పాటు చేశారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా తాత్కాలిక గదులను నిర్మించారు.

అగనంపూడి: పెదమడక ఉమామహేశ్వర ఆలయం, కర్రివానిపాలెం ఉమాసంతోషి ఆలయం, పాతఅగనంపూడి లింగాల తిరుగుడి, జాబిలిహిల్స్‌లో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు లలితా, విష్ణు సహస్రనామార్చన చేశారు. బీసీ కాలనీ దివ్యజ్యోతి భవనంలో బ్రహ్మకుమారీలు ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు.

గోపాలపట్నం: స్థానిక చంద్రమౌళీశ్వరాలయం, భీమేశ్వరాలయం, కొత్తపాలెం ఉమానాగలింగేశ్వరాలయం, ఎంఈఎస్ పంపుహౌస్ పార్వతీ సహిత చంద్రశేఖరాలయం, యల్లపువానిపాలెం, పద్మనాభనగర్, ఆర్ఆర్ వెంకటాపురం శివాలయాల్లో శివరాత్రి పూజలు జరిగాయి. నరవ ఉమానాగలింగేశ్వర ఆలయంలో సుమారు 15వేల మంది భక్తులు పాల్గొన్నారు.

పెందుర్తి రూరల్: మండలంలోని చింతల అగ్రహారం, లక్ష్మీపురం, పినగాడి, చీమలాపల్లి, శానాపతివానిపాలెం, పురుషోత్తపురం హౌసింగ్‌బోర్డు కాలనీ శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం శివ పార్వతీ కల్యాణం, తిరువీధి నిర్వహించారు. రాత్రి ఒంటి గంట తర్వాత రుద్రాభిషేకాలు చేశారు.

కూర్మన్నపాలెం: పారిశ్రామిక ప్రాంతంలోని శివాలయాలు కిటకిటలాడాయి. మాతృశ్రీనగర్ విశ్వేశ్వర ఆలయంలో హోమాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. దువ్వాడ చినయాతపాలెం, సాయిరాంనగర్‌లో స్వయంభూ శివలింగం వద్ద పూజలు జరిగాయి. వడ్లపూడి, కణితి, కూర్మన్నపాలెం, దువ్వాడ, ఉడా నగర్, రాజీవ్‌నగర్, శాతవాహననగర్ శివాలయాలు భక్తులతో సందడిగా మారాయి. వడ్లపూడి ఉమా మార్కండేశ్వర స్వామి ఆలయంలో రుద్రహోమం, ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. కణితి శివాలయంలో ప్రత్యేక పూజలు సాగాయి. కూర్మన్నపాలెం రాజీవ్‌నగర్ సోడ సోమన్న శివాలయం, సాయిరాంనగర్‌లో చంద్రమౌళీశర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 18 అడుగుల ఏకశిలా శివలింగం వద్ద ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. సంపత్ వినాయక ఆలయం, శ్రీనగర్ మారామలింగేశ్వర స్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు జరిగాయి. చట్టివానిపాలెం శివాలయంలో వెయ్యి లీటర్ల ఆవుపాలు, 30 రకాల దినుసులతో అభిషేకం చేశారు. శివలింగాన్ని బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించారు. ఆటోనగర్ శివాలయంలో విశేష అభిషేకాలు నిర్వహించారు.

వేపగుంట: నాయుడుతోట కృష్ణానగర్ దుర్గామల్లేశ్వరాలయం, రవినగర్, ప్రహ్లాదపురం, వేపగుంట, శ్రీముత్యాలమ్మ ప్రాంగణంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వీరాంజనేయ ఆలయం వద్ద అన్న సమారాధనను ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. ఎస్.ఎ.డి. కాశీ విశ్వేశరాలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. సుసుర్ల కాలనీలోని చంద్రమౌళీశ్వరాలయం, కాకానీనగర్ శివాలయాలను ఎమ్మెల్యే గణబాబు, వైసీపీ పశ్చిమ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్ పూజలు చేశారు. లక్ష్మీనగర్ ఉమా గణపతి ఆలయంలో వేడుకలు నిర్వహించారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని కాశీ విశ్వేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. అక్కిరెడ్డిపాలెం ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. నాతయ్యపాలెం, తుంగ్లాం, మిందికాలనీ శివాలయాలను భక్తులు దర్శించుకున్నారు.

గాజువాక: వినాయకనగర్‌లోని విశాలక్ష్మి విశ్వేశ్వర పంచాయతన ఆలయం, కణితి రోడ్డు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, డబుల్ రోడ్డులోని శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, సమతానగర్, వుడా రోడ్డు, స్టీల్‌ప్లాంట్‌లోని శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

పెందుర్తి: సరిపల్లి శివాలయంలో క్షీరాభిషేకాలు జరిగాయి. పాత పెందుర్తి, ప్రశాంతినగర్, పినగాడి చోడేశ్వర శివాలయం, రత్నగిరినగర్‌లోని విశాలాక్షీ విశ్వేశ్వర ఆలయం, సుజానగర్‌లోని హరిహర క్షేత్ర శివాలయం, చినముషిడివాడ, శ్రమశక్తినగర్, వుడా కాలనీలోని ఉమారామలింగేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

మల్కాపురం: మహా శివరాత్రి సందర్భంగా సముద్రస్నానాల కోసం మహిళలు ఆర్కేబీచ్, యారాడ, గంగవరం, అప్పికొండ బీచ్‌లకు వెళ్లారు. మాజీ సైనికుల కాలనీ, శివరామపురం వీధిలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పెదగంట్యాడ: దుర్గవానిపాలెం శ్రీ గౌరీ పరమేశ్వరుల ఆలయంలో జరిగిన పూజల్లో మేయర్ హరి వెంకటకుమారి దంపతులు పాల్గొన్నారు. నెల్లిముక్కు కాశీ విశ్వేశ్వరాలయంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, వెంకటరమణారెడ్డి దంపతులు పూజలు చేశారు. వికాస్‌నగర్, గిరిజాకాలనీ, బాలచెరువు శివాలయం, స్టీల్‌ప్లాంట్ బాలచెరువుగేటు వద్ద పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరాలయం, ప్రియదర్శినీకాలనీ ఉమా రామలింగేశ్వరాలయం, నడుపూరు శివాలయంలో పూజలు, అభిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



ఆటోనగర్‌లో పూజలందుకుంటున్న శివుడు



గోపాలపట్నం బంక్ కూడలి ఆలయంలో పూజలు



ప్రకాశ్‌నగర్ శివాలయంలో భక్తులు



కిటకిటలాడిన దుర్గవానిపాలెం శివాలయం

'సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి'

పెదగంట్యాడ, మార్చి 8: టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పథకాలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం సాయంత్రం పెదగంట్యాడ జంక్షన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువతకు ఉపాధి, ప్రతి నిరుద్యోగికి రూ.3వేలు నిరుద్యోగభృతి, స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏటా రూ.15 వేలు పెట్టుబడి సాయం, ప్రతిరైతుకు ఏటా రూ.20 వేలు, ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇందులో ఉన్నాయన్నారు. వీటిని ఇంటింటికీ ప్రచారం చేయాలని కార్యకర్తలను కోరారు. శ్రీముసిరి శ్రీనివాసరావు, ములకలపల్లి పెంటయ్య, బొంగు రాజు, ఉరుకూటి వెంకటరావు, కాకినాడ అప్పలరాజు, మొల్లి రమణ, నక్కసింహాచలం, కర్రి సోమరెడ్డి, దొమ్మేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపండి

కూర్మన్నపాలెం: ప్రజలను పీడిస్తున్న వైసీపీ పాలనకు చరమ గీతం పాడి, టీడీపీ- జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. వడ్లపూడిలో శుక్రవారం బూత్ ఇన్‌చార్జిలతో మాట్లాడారు. రాజధాని లేకుండా చేసిన సీఎం విశాఖను రాజధాని చేస్తానంటూ పరిహాసాలాడుతున్నారన్నారు. విజయరామరాజు, రాంబాబు, రాజన్ రాజు, శ్రీనివాస వర్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొండా జగన్

దేశాభివృద్ధిలో మహిళలకు కీలకపాత్ర

గోపాలపట్నం, మార్చి 8: దేశాభివృద్ధిలో మహిళలది కీలకపాత్రని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (పూణె) మాజీ డైరెక్టర్ డాక్టర్ ప్రియా అబ్రహం జ్యోతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్‌టీఎల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళా శాస్త్రవేత్తలు, ఉద్యోగులను సత్కరించారు.కార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహంవర్గీస్, నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ క్లసర్ ప్రథమ మహిళ వై.లక్ష్మి, మహిళా కల్యాణ్ మంచ్ అధ్యక్షురాలు ఇలిన్‌దీనా అబ్రహం, డాక్టర్ బి.మమత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోనే మహిళలకు సముచిత గౌరవం

గాజువాక /ఉక్కుటౌన్‌షిప్: మహిళలకు సముచిత స్థానం ఇచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. పార్టీ గాజువాక కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో ప్రసాదుల శ్రీనివాస్, సుజాత, దీప్తి పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో పార్టీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు పలువురిని సత్కరించారు. కాంగ్రెస్ నేత చెల్లుబోయిన నాయుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో మహిళలను సత్కరించారు. యలమంచిలి నాగమల్లిక, నెల్లి తులసి, అరుణ, అప్పలరాజు, రమణమూర్తి పాల్గొన్నారు.

మహిళల్లో నాయకత్వ లక్షణాలు ముఖ్యం

ఉక్కుటౌన్‌షిప్: మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని వీఎంఎస్ అధ్యక్షురాలు నహూర్‌భట్ అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. గీతం స్కూల్ ఆఫ్ లా డాక్టర్ అనితారావు పలు అంశాలపై ప్రసంగించారు.

పెందుర్తి: మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో రైతుబజార్ వద్ద ర్యాలీ నిర్వహించారు. మహిళలపై దాడులను నియంత్రించాలని, చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలుచేయాలని నినాదాలు చేశారు. దేవి, రమణి, విజయ పాల్గొన్నారు. చినముషిడివాడలో పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో లక్ష్మి, వెంకటలక్ష్మి, ఇందిర పతాకావిష్కరణ చేశారు. మహిళలు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు రూప, గీత, వరలక్ష్మి, ఎరుకలమ్మ పాల్గొన్నారు.

మల్కాపురం: స్థానిక శెట్టిబలిజ వీధిలో కేక్ కట్ చేసి మహిళలు మహిళా దినోత్సవం నిర్వహించారు. శాఖా గ్రంథాలయంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మిని సత్కరించారు. అజేయ్‌కుమార్, సత్తిరాజు, అనసూయదేవి, మనోహర్ పాల్గొన్నారు. శ్రీహరిపురంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. షిప్‌యార్డు మహిళ ఉద్యోగులు, కేక్‌కట్ చేశారు. లేడీస్ క్లబ్ అధ్యక్షులు వందన కర్రీ మహిళా దినోత్సవ ప్రాధాన్యత వివరించారు.

అగనంపూడి: అగనంపూడిలో మహాత్మాగాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆధ్యాత్మిక సేవ చేస్తున్న బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులను సత్కరించారు. సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు, సేవా సమితి ప్రతినిధులు సత్యవతి, లలిత, పద్మ, పద్మావతి, శోభారాణి, రత్నం, బాలా, ప్రశాంతి, శిరి తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: మహిళలు విద్యావంతులైతే.. హక్కులు, అవకాశాలను తెలుసుకొని రాణించగలరని భెల్ హెచ్‌పీవీపీ ఈడీ ఎస్. జితేందర్‌రెడ్డి అన్నారు. పరిశ్రమలో శుక్రవారం మహిళా దినోత్సవం నరిర్వహించారు. మహిళా ఉద్యోగినులను సత్కరించారు. ఈ జీఎం గౌరీ శంకర్, శుభాకర్ సాహు, కొల్లి దేముడు, రాజు, బాబూరావు, భాస్కరరావు, రాము, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. ఐద్వా ఆధ్వర్యంలో అక్కిరెడ్డిపాలెంలో కె.శ్రీలక్ష్మి పతాకావిష్కరణ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. మహిళలను సత్కరించారు.

జనసేనతోనే మహిళా సాధికారత

కూర్మన్నపాలెం: మహిళా సాధికారతే లక్ష్యమని జనసేన పీఏసీ సభ్యులు కోన తాతారావు అన్నారు. పార్టీ కార్యాలయం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సదస్సులో వీర మహిళలను సత్కరించారు. లంకల మురళీ దేవి, జ్యోతి రెడ్డి, ఇందిర ప్రియదర్శిని, షాలిని, తులసి, గౌరి, రమాదేవి, లత, మహేశ్వరి, అరుణ కుమారి, ఆదిలక్ష్మి, జయలక్ష్మి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: మహిళలు ఆర్థిక స్వావలంబనతో పాటు ఆరోగ్యంగా ఉండాలని సింహగిరి చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ కేవీఎస్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గాజువాక సింహగిరి హాస్పిటల్‌లో శుక్రవారం మహిళలకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ట్రస్ట్ ఎండీ ట్రైకాలజిస్ట్ డాక్టర్ కె.జమునారాణి ఆరోగ్యానికి అవసరమైన జాగ్రత్తలు వివరించారు. డైరెక్టర్ మౌనిక, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కల్యాణ్ పాల్గొన్నారు.



భెల్‌లో మహిళా ఉద్యోగులకు సత్కారం



మహిళలను సత్కరిస్తున్న గాజువాక కాంగ్రెస్ నేతలు



వీర మహిళలను సత్కరించిన జనసేన నేత తాతారావు

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం: ఎమ్మెల్యే గణబాబు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, మార్చి 8: యువత క్రీడాల్లో రాణిస్తే సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఉత్సాహంగా ఉంటారని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పేర్కొన్నారు. శివరాత్రి సందర్భంగా 58వ వార్డులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం విండ్‌బాల్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడారు. జనసేన ప్రతినిధులు పోటీలను నిర్వహించడం శుభ పరిణామమన్నారు. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీల నాయకులు., కార్యకర్తలు కలిసి పనిచేసి విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్న, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరీ, 58వ వార్డు జనసేన అధ్యక్షుడు ధర్మేంద్ర, ఈడీపీ నేతలు రామ్మోహన్‌నాయుడు, కోరాడ శ్రీనివాసరావు, పొత్తబత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలకు ఉక్కు క్రీడాకారులు



క్రీడాకారులతో ఉక్కు సీజీఎం (మెడికల్) కెహెచ్ ప్రకాష్

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 8: జంషెడ్‌పూర్‌లో ఈ నెల 12నుంచి నిర్వహించనున్న ఆలిండియా ఇంటర్ స్టీల్‌ప్లాంట్ల బాక్సింగ్ పోటీల్లో ఆరుగురు ఉక్కు క్రీడాకారులు పాల్గొననున్నారు. సబ్ జూనియర్ కేటగిరీలో ఎస్.నరంద్రకుమార్, ఎం.దిలేష్, కె.సాయిలోహిత్, జూనియర్ విభాగంలో ఎం.లికిత్‌కుమార్, ఎస్.రామ్‌చరణ్‌కుమార్, కె.దేవిశ్రీప్రసాద్, టీఎం మేనేజర్ బి.రామారావు, రిఫరీ ఎస్‌వీ.శర్మ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను శుక్రవారం క్రీడా విభాగంలో సీజీఎం (మెడికల్) కెహెచ్.ప్రకాష్, కోచ్ కె.శ్రీనివాసరావు అభినందించి కిట్లు అందజేశారు. క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రీడా విభాగం అధికారులు ఏకే గడాయి, కాశీవిశ్వేశ్వరరావు, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం'



ఈడీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్ష కార్మిక నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 8: కార్మిక సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు తప్పవని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు హెచ్చరించారు. ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద శుక్రవారం బయోమెట్రిక్‌కు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యాజమాన్యం ఏకపక్షంగా ముందుకు సాగుతుందని, కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు.కార్మికులకు వేతన ఒప్పందం చేసి, ప్లాంట్‌లో సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జె.అయోధ్యరాం, వరసాల శ్రీనివాసరావు, నీరుకొండ రామచంద్రరావు, జి.గణపతిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి పరస



అగనంపూడి, మార్చి 8: ఈ- మర్రిపాలెం శివారు గొన్నవానిపాలెం ఆంజనేయస్వామి ఆలయం వద్ద పరస మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పరసను నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, తప్పెడగుళ్లు, సాము గరిడీలు, బొమ్మల కొలువు, డాన్స్ బేబీ డాన్స్ తదితర కార్యక్రమాలు అలరించాయి. గొన్న హేమచంద్‌నాయుడు, గొన్న శ్రీనివాసరావు, రమాదేవి, బొర్రమాంబ యూత్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

గోపాలపట్నం, మార్చి 8: జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో విధులు నిర్వహిస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులను బెహరా సన్మానించారు. కార్యక్రమంలో జోన్ మెడికల్ అధికారి కృష్ణంరాజు, శానిటరీ సూపర్ వైజర్ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి, సిబ్బంది దమ్ము శ్రీనివాస్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కును ప్రైవేటీకరిస్తే లక్షల కుటుంబాలకు నష్టం'

కూర్మన్నపాలెం, మార్చి 8: మోదీపాలనలో లక్షల కర్మాగారాలు మూతపడి ఉపాధి పొందుతున్న వేలాది మంది రోడ్డున పడ్డారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు యు.రామస్వామి అన్నారు. కూర్మన్నపాలెంలో శుక్రవారం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరం 1021 రోజులకు చేరుకొంది. ఈసందర్భంగా కార్మికుల నుద్దేశించి రామస్వామి మాట్లాడుతూ ప్రత్యక్షంగా లక్షలాది మంది కుటుంబాలు విశాఖ ఉక్కు కర్మాగారం పై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తే ఈ కుటుంబాలు వీధినపడతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఉక్కు కర్మాగారం నవరత్న హోదాతో, గతేడాది లాభాల బాటలోనే ఉందన్నారు. అయినా, నష్టాల బూచిని చూపి ప్రైవేటీకరణకు ప్రభుత్వాలు పూనుకోవటం చాలా హేయమైన చర్యని అభివర్ణించారు. మరో నాయకులు ఎస్.రామారావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నాయన్నారు. ప్రజా పోరాటాలతో ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉక్కు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

'మేము సిద్ధం... మా బూత్ సిద్ధం' ప్రారంభం

మల్కాపురం, మార్చి 8 : రానున్న ఎన్నికల్లో టీడీపీ కుట్రలను భగ్నం వైసీపీ గెలుపునకు కృషి చేయాలని పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని శుక్రవారం కొత్తనక్కావానిపాలెం వైసీపీ కార్యాలయంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం అమలుచేయనన్ని సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అమలుచేసిందన్నారు. విద్య వైద్య రంగాన్ని పెద్దపీట వేసిందని తెలిపారు. ప్రతిపక్షాలు లేనిపోని అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నాయని, వీటిని తిప్పికొట్టాలని అన్నారు. గ్రేటర్ 40, 61, 62, 63 వార్డుల జేసీఎస్ మండల కన్వీనర్ భోగవిల్లి నాగభూషణం అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కర్‌రావు, 62వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు, 40వ కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, గల్లా శ్రీను పాల్గొన్నారు.

ఎస్టీబీఎల్‌లో శాంతి కల్యాణం

అక్కిరెడ్డిపాలెం, మార్చి 8: శ్రవణా నక్షత్రం, అమావాస్య సందర్భంగా షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా పూలు, నగలతో స్వామి వారిని అలంకరించారు. సాయంత్రం ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామివారిని ప్రతిష్ఠించి శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ పూజల్లో పాలకమండలి సభ్యులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కల్యాణం జరుగుతున్న దృశ్యం

'విశాఖ దక్షిణ టికెట్ ముస్లింలకు కేటాయించాలి'



అల్లిపురంలో నిరసన తెలుపుతున్న ముస్లిం పెద్దలు

అల్లిపురం, జగదాంబ, మార్చి 8: రానున్న ఎన్నికల్లో విశాఖ దక్షిణ నియోజకవర్గం అసెంబ్లీ టికెట్ ముస్లింసామాజిక వర్గానికి కేటాయించాలని ముస్లిం మత పెద్దలు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం జుమా నమాజ్ అనంతరం అల్లిపురంలోని మసీద్ ఏ ఫిర్దోస్ వద్ద, వన్‌టౌన్ ఏరియా చంగల్రావుపేటలోని జామియా మసీదు ఆవరణలో టికెట్ కేటాయించాలంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా మసీద్ ఏ ఫిర్దోస్ కమిటీ అధ్యక్షుడు మహబూబ్ షరీఫ్ మాట్లాడుతూ.. విశాఖ జిల్లా వ్యాప్తంగా జనాభాలో రెండో స్థానంలో ఉన్న ముస్లింలకు చట్టసభలలో సరైన స్థానాన్ని ప్రధాన రాజకీయ పార్టీలు కల్పించకపోవడం దారుణమని విమర్శించారు. దక్షిణ నియోజకవర్గ పరిధిలో 25వేల ముస్లిం ఓటర్లు ఉన్నారని, ఈ స్థితిలో ఈ టికెట్ తమ సామాజికి వర్గానికి కేటాయించాలని డిమాండ్‌చేశారు. లేని పక్షంలో ముస్లిం నేతలు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తారని హెచ్చరించారు.

'శివరాత్రి రోజు తెరిచిన పాఠశాలలపై చర్యలకు సిఫార్సు'

సీతమ్మధార, మార్చి 8: మహాశివరాత్రికి ప్రభుత్వం అన్ని పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించిందని, ఈ ఆదేశాలను ధిక్కరించి నగరంలోని కొన్ని పాఠశాలలు తెరిచి తరగతులు నిర్వహించినట్టు ఫిర్యాదులు అందినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారామ్ పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు వాటిపై డీఈవోకు పరిశీలించాలని సూచించామన్నారు. జిల్లా ఉన్నత అధికారులు త్వరలో ఇచ్చిన సమాచారంపై ఆయా స్కూల్ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని సీతారామ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

26వ వార్డులో బీజేపీ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న విష్ణుకుమార్‌రాజు

అక్కయ్యపాలెం, మార్చి 8 : గ్రేటర్ 26వ వార్డు శంకువానిపాలెంలో బీజేపీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు శుక్రవారం ప్రారంభించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో తాను ఉత్తర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నట్టు ఈసందర్భంగా చెప్పారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభి వృద్ధికి నిరంతరం పాటుపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీతమ్మధార మండల అధ్యక్షుడు నాగ డమూడి నానాజీ, 26వ వార్డు అధ్యక్షుడు కేవీ కుమార్, నాయకులు బొడ్డేటి రవికుమార్, రఘునాథ్, పద్మ, మాదేటి కనకారావు, కొప్పిశెట్టి శంకరరావు, గార ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో నష్టమే..

మహరాణిపేట, మార్చి 8: ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఎమ్‌ఐఎఫ్ ప్రతినిధి ఎం. హర్ష అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, వాటి నియంత్రణపై జిల్లా పరిషత్ సమీపాన సమావేశ మందిరంలో మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీ వల ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తి రెండింతలు పెరగడం ఆం దోళనకలిగించే విషయమన్నారు. ఇది సామాజిక , ఆర్థిక, పర్యావరణ పరిస్థితులపై ప్రభావాన్ని చూపి స్తుందన్నారు. వ్యర్థాలతో తలెత్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. పలువురు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బి. సింహాచలం నాయుడు తెలిపారు. ముస్లిం తాటిచెట్లపాలెం, ఆంధ్రజ్యోతి ఏరియా, అక్కయ్యపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.



చైతన్యనగర్‌లో పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



సీతంపేట పార్వతీశ్వరాలయంలో పాలాభిషేకం చేస్తున్న అర్చకులు

వాడవాడలా శివరాత్రి వేడుకలు

సీతమ్మధార, మార్చి 8: వాడవాడలా మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి పురస్కరించుకుని ఏకవార అభిషేకాలను ఆలయ అర్చకులు రామారావు శర్మ, మహేష్ శర్మ నిర్వహించారు. పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో అభిషేకాలను నిర్వహించారు. ఈ పూజల్లో వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, వైసీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు పాల్గొన్నారు. సీతంపేట గణేశ్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 9 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను అర్చకులు భాస్కర్‌శర్మ, శివాజీ శర్మ జరిపారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో ప్రత్యేక అభిషేకాలను జరిపారు.

కాశీ విశ్వేశ్వరుని కల్యాణం

చైతన్యనగర్-మద్దిలపాలెంలోని వినాయక, శివాలయం, షిర్డీ సాయి, అయ్యప్పస్వామి ఆలయాల సముదాయంలో సప్తాయతన ఆలయ సంఘం ఆధ్వర్యంలో ధనిష్ట నక్షత్రయుత కన్యాలగ్నంలో కాశీవిశ్వేశ్వరుడు, అన్నపూర్ణాదేవి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

ప్రతి ఒక్కరూ భగవన్నామ స్మరణ చేయాలి..

డాబాగార్డెన్స్: ప్రతి ఒక్కరూ భగవన్నామ స్మరణ చేయాలని ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆర్టీసీ కాంప్లెక్స్ దరి భగవాన్ శ్రీ సత్యానంద విశ్వవిహార్‌లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ముందుగా పరమేశ్వరునికి అభిషేకాలు, మహా మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యానంద మహర్షి జయంతిని నిర్వహించారు. మాతాజీ సునంద, శ్రీనివాసస్వామి, ఆశ్రమ ప్రతినిధులు బీవీఎస్ సత్యనారాయణ, బి.లక్ష్మణస్వామి, దాసు సోదరులు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదవితరణ చేశారు.

మురళీనగర్; మాధవధార కొండపై ఆలయం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున ఆలయంలో అర్చకులు శ్రీనివాస శర్మ పూజాభిషేకాలు, గోత్రనామాలతో పూజలు జరిపారు. రాత్రి లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. పట్టాభిరెడ్డితోటలోని శ్రీకాశీ విశ్వేశ్వర దేవస్థానం, మురళీనగర్ గౌరీ రామలింగేశ్వరాలయంలో పూజలు ఘనంగా జరిగాయి. అదేవిధంగా మురళీనగర్ బ్రహ్మకుమారీలు శాంతి ధామంలో శివ అవతరణ వేడుకలు చేపట్టారు.

శివనామస్మరణతో మార్మోగిన శైవలయాలు

జ్ఞానాపురం: జ్ఞానాపురం, అల్లిపురం ప్రాంతాల్లోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. వైర్లస్‌కాలనీ, డీఎలస్ రైల్వే కాలనీ, అస్సాం గార్డెన్స్, అల్లిపురం మెయిన్‌రోడ్డు, జ్ఞానాపురం ఉన్న ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో..

అక్కయ్యపాలెం: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రైల్వేన్యూకాలనీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఇన్‌చార్జి శశికళ మాట్లాడుతూ శివరాత్రి ప్రాధాన్యం, ఉపవాస జాగరణల అంతరార్థాన్ని వివరించారు. ఈకార్యక్రమంలో రైల్వేన్యూకాలనీ మసీద్ ప్రెసిడెంట్ మహ్మద్ అబ్దుల్ గఫార్, గురుద్వారా ప్రధాన పూజారి జస్ప్రీత్ సింగ్, ప్రొటెక్టర్ ఆర్చ్ డయాసిస్ ఫాదర్ జైరాజ్, లైట్ హౌస్ , లైట్ షిప్స్ ముఖేశ్ తదితరులు పాల్గొన్నారు.దొండపర్తి ఎరుకుమాంబ ఆలయం, రామకృష్ణానగర్‌లోనిశివాలయం, జగ్గారావు బ్రిడ్జివద్ద ఉన్న గౌరీపరమేశ్వరాలయం, రైల్వేన్యూకాలనీ, కైలాసపురం, లక్ష్మీనారాయణపురం, తదితర ప్రాంతాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివునికి పూజలు చేశారు.



రైల్వే కాలనీలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు



డీఎల్ఎస్ కాలనీ శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా దుర్గాలమ్మ తొలేళ్ల ఉత్సవం

పూర్ణామార్కెట్, మార్చి 8: పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడివద్ద మహాశివరాత్రి నేపథ్యంలో శుక్రవారం తొలేళ్ల ఉత్సవం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పలు వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి అమ్మవారికి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం గుడి పరిసరాలన్నీ పూర్తిగా జనంతో కిక్కిరిసిపోయాయి. దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నారు. దుర్గమ్మ మాలధారులతో పరిసరాల్లో భక్తిభావన నెలకుంది. నిప్పుల గుండం ప్రదర్శన భక్తులు ఆసక్తిగా తిలకించారు. పూర్ణామార్కెట్ వెలంపేట, రామకృష్ణా జంక్షన్, ఇందిరా స్టేడియం ఏరియా, ప్రసాద్ గార్డెన్స్ పరిసరాలన్నీ పూర్తిగా జనంతో దర్శనమిచ్చాయి. విద్యుత్ దీపాలతో పూర్ణామార్కెట్ నుంచి రామకృష్ణా రైతుబజార్,ప్రసాద్ గార్డెన్స్ వద్ద దుర్గమ్మ పందిళ్లను శోభాయమానంగా అలకరించారు.

నీలమ్మ అమ్మవారి జాతర

అల్లిపురం, మార్చి 8: జీవీఎంసీ 33వవార్డు పరిధి అల్లిపురంలోని శ్రీనీలమ్మ అమ్మవారి జాతర శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలిపూజను ఆలయ ట్రస్ట్ చైర్మన్ బొర్రావిజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి దంపతులతో జరిపించారు. అనంతరం ఉదయం 6గంటల నుంచి 8 వరకు అమ్మవారికి ప్రత్యేక కుంకుమపూజలు, ఉదకాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, సుగంధ ద్రవ్యాభిషేకాలు నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు భక్తులకు తాగునీటి సరఫరా, ప్రసాద వితరణ చేశారు. ఉదయం అమ్మవారిని విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి దర్శించుకుని భక్తులకు ఆశీస్సులు అందించారు. అనంతరం అమ్మవారిని ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి, కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, జనసేన నగర అధక్షుడు వంశీకృష్ణయాదవ్, బొడ్డేపల్లి రఘు,సుందరపు సతీష్‌కుమార్, మహ్మద్‌సాదిక్ తదితర ప్రముఖులు దర్శించుకున్నారు. సాయంత్రం తిరువీధుల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈవో రమాబాయి, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.



ఉత్సవంలో పాల్గొన్న సీతంరాజు సుధాకర్, కమిటీ సభ్యులు

మహిళలకు బాసటగా టీడీపీ: గంటా

అక్కయ్యపాలెం, మార్చి 8 : మహిళలకు బాసటగా తెలుగుదేశం ప్రభుత్వం నిలుస్తుందని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ట్విట్టర్‌లో పోస్ట్ ద్వారా తెలిపారు.. ఎక్కడ స్త్రీలు పూజలందుకుంటారో అక్కడ దేవతలు కొలువై ఉంటారన్నారు. కానీ, దేవతగా కొలవాల్సిన స్త్రీ మూర్తిపై అత్యాచార, అఘాయిత్యాలతో నేటి పరిస్థితులు ఆందోళన కలిగిస్తుందని చెప్పారు. వీటి నివారణకు అనుగుణంగా చట్టాల్లోనూ సమూల మార్పులు రావాలన్నారు. ముందుగా వనితలందరికీ ఆయన అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా సాధికారత దిశగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మరో కీలక ముందడుగు వేశారని పేర్కొన్నారు. కలలకు రెక్కలు పేరిట ఓ సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకువచ్చారన్నారు.

ఏపీలో ఏ ఆడ బిడ్డ కూడా చదువుకు సంబంధించి డబ్బుల కొరతతో ఇంటికి పరిమితం కాకూడదనే ఆలోచనతో ఈపథకం అమలు చేయనున్నారన్నారు. ఏపీలో మహిళలకు వృత్తి, విద్యకు సంబంధించి మార్గాలను అందించడంతో పాటు వారికి మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడం టీడీపీ లక్ష్యమన్నారు. మహాశక్తి పథకం ద్వారా ఇంట్లో 18 నుంచి 59 ఏళ్ల మధ్య ఉండే ప్రతి మహిళకు నెలకు రూ.15 వేలు, దీపం పథకం కింద ప్రతి మహిళకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, ప్రతి మహిళ జిల్లాలో ఎక్కడికి వెళ్లాలన్నా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని, మీ ఉన్నతికి నిరంతరం పాటు పడే టీడీపీకి ప్రతి ఆడపడుచు అండగా నిలబడాలన్నారు. పురుషులకు ధీటుగా సమైక్య శక్తులుగా, సాహస మూర్తులుగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీగా విజయభాస్కర్

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ విశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులగా సమగ్రశిక్షా అభియాన్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అకడమిక్ మోనటరింగ్ అధికారిగా ఉన్న బి. విజయ భాస్కర్‌ను నియమించారు. ఆయన స్థానంలో విశాఖ ఆర్జేడీగా పనిచేస్తున్న ఎం. జ్యోతి కుమారిని బదిలీ చేశారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల పరిధిలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల పర్య వేక్షణ, విద్యాబోధన, టీచర్ల సర్వీస్ వ్యవహారాలను ఆర్జేడీ కార్యాలయం పర్యవేక్షిస్తోంది.



ఆర్జేడీ విజయభాస్కర్

చేతులు కలిపిన ఉద్దండులు!

... 5వ పేజీ తరువాయి

కొణతాల రామకృష్ణ మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. మూడేళ్ల తరువాత 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దాడి వీరభద్రరావు మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధించారు. రెండేళ్ల తరువాత 1996లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కొణతాల మూడోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడు చేతిలో ఓడిపోయారు. లోక్‌సభకు 1998లో మధ్యంతర ఎన్నికలు జరగ్గా..కాంగ్రెస్ తరపున కొణతాల పోటీ చేయలేదు. ఆయన బదులు గుడివాడ గురునాథరావు పోటీ చేసి ఎంపీగా గెలిచారు. మళ్లీ ఏడాది తిరగకుండా 1999లో లోక్‌సభ మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. ఇదే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగాయి. కొణతాల రామకృష్ణ ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీకి పోటీ చేశారు. టీడీపీ నుంచి యథావిధిగా దాడి వీరభద్రరావు పోటీ చేశారు. హోరాహోరీగా జరిగిన ఈ పోరులో 3,711 ఓట్ల మెజారిటీతో వీరభద్రరావు గెలిచారు. అప్పటి నుంచి రాజకీయ వైరం మరింత పెరుగుతూ వచ్చింది. మళ్లీ 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి దాడి, కాంగ్రెస్ తరపున కొణతాల తలపడ్డారు. ఈ ఎన్నికల్లో కొణతాల గెలుపొందగా, దాడి వీరభద్రరావు తొలిసారి ఓటమి చవిచూశారు. అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో కొణతాల వాణిజ్య, న్యాయ, ఎక్సైజ్ శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. తరువాత టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, దాడి వీరభద్రరావుకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి, శాసనమండలి పక్షనేత హోదా కల్పించారు. 2009 ఎన్నికల్లో కొణతాల కాంగ్రెస్ నుంచి, వీరభద్రరావు టీడీపీ నుంచి పోటీ చేయగా, కొత్తగా ఏర్పడిన ప్రజారాజ్యం పార్టీ తరపున గంటా శ్రీనివాసరావు పోటీ చేశారు. త్రిముఖ పోటీ జరిగిన ఈ ఎన్నికల్లో గంటా గెలుపొందారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం తరువాత ఆయన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటుచేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొణతాల రామకృష్ణ చేరారు. 2014 ఎన్నికల ముందు దాడి వీరభద్రరావు టీడీపీని వీడి వైసీపీలో చేరారు. ఇద్దరు నేతలు ఒకే పార్టీలో ఉన్నప్పటికీ ఎక్కడా ఒకే వేదికను పంచుకున్న దాఖలాలు లేవు. ఆ ఎన్నికల్లో వీరభద్రరావు తనయుడు రత్నాకర్ విశాఖ పశ్చిమ నుంచి, కొణతాల సోదరుడు రఘునాథ్ అనకాపల్లి వైసీపీ అభ్యర్థులుగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. కొంతకాలం తరువాత వైసీపీ అధినేత తీరు నచ్చక ఇద్దరూ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. టీడీపీలో చేరాలని భావించినప్పటికీ అనివార్య కారణాల వల్ల చేరలేదని రాజకీయ వర్గాల సమాచారం. దాదాపు నాలుగేళ్లపాటు రాజకీయంగా స్తబ్దుగా వున్నారు. గత ఎన్నికల ముందు దాడి వీరభద్రరావు మళ్లీ వైసీపీలో చేరారు. కొణతాల రామకృష్ణ తటస్థంగానే ఉన్నారు. అయితే అనకాపల్లి ఎంపీ అభ్యర్థి ఆడారి ఆనందకుమార్‌తోపాటు టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా కొన్నిచోట్ల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ దాడి వీరభద్రరావు కుటుంబానికి తగిన న్యాయం జరగలేదు. దీంతో ఇటీవల తన కుమారులు రత్నాకర్, జయవీర్‌లతో కలిసి దాడి వీరభద్రరావు టీడీపీలో చేరారు. ఇది జరిగిన కొద్ది రోజులకే కొణతాల రామకృష్ణ జనసేన పార్టీలో చేరారు. తరువాత టీడీపీ-జనసేన కూటమి పొత్తులో భాగంగా అనకాపల్లి సీటును జనసేనకు కేటాయించడంతో, కొణతాల రామకృష్ణను అభ్యర్థిగా ప్రకటించడం ఒకేసారి జరిగిపోయాయి. దీంతో దశాబ్దాల కాలంగా వున్న రాజకీయ వైరాన్ని పక్కన పెట్టి కొణతాల రామకృష్ణ శుక్రవారం దాడి వీరభద్రరావు ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో తనకు సహకరించాలని కోరారు. సుదీర్ఘ కాలంపాటు రాజకీయ ప్రత్యర్థులుగా వున్న ఇద్దరు ఉద్దండులు చేతులు కలపడంతో వచ్చే ఎన్నికల్లో అనకాపల్లితోపాటు పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజకీయ సమీకరణాలు మారతాయని విశ్లేషకులు అంటున్నారు.

కొణతాల విజయం కోసం పనిచేస్తాం

- దాడి వీరభద్రరావు ప్రకటన
- వైసీపీని ఓడించేందుకు టీడీపీ, జనసేన శ్రేణులు కలిసి పనిచేయాలని పిలుపు
- కూటమి గెలుపే లక్ష్యం: కొణతాల

అనకాపల్లి టౌన్, మార్చి 8: అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ శుక్రవారం సంతబయలు ప్రాంతంలో గల మాజీ మంత్రి దాడి వీరభద్రరావు నివాసానికి వెళ్లారు. ఎన్నికల్లో తనకు సహకరించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా దాడి వీరభద్రరావు మాట్లాడుతూ తమ రెండు కుటుంబాల మధ్య రాజకీయాలకు ముందు అవినాభావ సంబంధాలు ఉండేవన్నారు. రాజకీయపరమైన విభేదాలే తప్ప వ్యక్తిగత సమస్యలు ఏమీ లేవన్నారు. కొణతాల తండ్రి సుబ్రహ్మణ్యంతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో కొణతాలను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు తామంతా కలిసి పని చేస్తామని దాడి వీరభద్రరావు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా జగన్‌ను ఓడించడమే లక్ష్యంగా ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో డబ్బుతో గెలుపొందాలని వైసీపీ భావిస్తుందన్నారు. నియోజకవర్గం లేని వ్యక్తి ఉమ్మడి జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని పరోక్షంగా మంత్రి అమర్‌నాథ్‌ను విమర్శించారు. అమర్‌నాథ్‌ను తన గుండెల్లో పెట్టుకుంటానని ముఖ్యమంత్రి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, గతంలో తన కుమారుడు రత్నాకర్‌ను కూడా అదేవిధంగా గుండెల్లో పెట్టుకుంటానన్నారన్నారు. కొణతాల విజయానికి కలిసికట్టుగా పనిచేసి, రాక్షస పాలనను తరిమికొడదామన్నారు.

స్టీరింగ్ కమిటీ ఏర్పాటుచేసుకుందాం: కొణతాల

జనసేన, టీడీపీతో పాటు బీజేపీ కూడా పొత్తులోకి వస్తున్నందున అందరం కలిసి పనిచేస్తామని కొణతాల రామకృష్ణ అన్నారు. దాడి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భవిష్యత్తులో ఒక సమావేశం ఏర్పాటుచేసి స్టీరింగ్ కమిటీ నియమించుకుందామన్నారు. ఆ కమిటీ ద్వారా పనులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కష్టపడిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును జైలులో పెట్టడం శోచనీయమన్నారు. చంద్రబాబునాయుడు హయాంలో సుజల స్రవంతి ప్రాజెక్టుకు నిధులు మంజూరుచేసినా వైసీపీ ప్రభుత్వంలో మాత్రం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన విజయమే లక్ష్యంగా పనిచేసి రాష్ట్రంతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో దాడి తనయుడు ప్రభాకర్, కొణతాల సత్యనారాయణ, మళ్ల రాజా, బొడ్డేడ శంకరరావు, బొడ్డపాటి చినరాజారావు, కోటిపల్లి జేజిబాబు, కొణతాల రమణబాబు, కృష్ణఅప్పారావు, పీలా నాగశ్రీను, మళ్ల సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తుత్తి బ్యాంకు

... 5వ పేజీ తరువాయి

సక్రమంగా చెల్లించకపోవడం వల్ల బ్యాంకు ట్రాక్ రికార్డు బాగోలేకపోయినా తాము మేనేజ్ చేసి లోన్ ఇప్పించేస్తామని నమ్మబలుకుతున్నారు. వారి మాటలు నిజమేనని భావించి ఎవరైనా లోన్ తీసుకోవడానికి ఆసక్తి చూపితే వారి నుంచి ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.20 వేలు ముందుగానే లాగేసుకుంటున్నారు. తర్వాత ఆస్తికి సంబంధించిన డాక్యుమెంట్లు, లోన్ మంజూరైన తర్వాత బ్యాంకుకు నెలవారీ వాయిదాలు కట్టేందుకంటూ 15 ఖాళీ చెక్‌లను తీసుకుంటున్నారు. రూ.20 వేలు చేతిలో పడగానే అక్కడి నుంచి పత్తాలేకుండాపోతున్నారు. ఏడాది గడిచినా రుణం మంజూరవ్వదు. దీంతో కొంతమంది ఆశ వదులుకుని రూ.20 వేలు పోయిందని ఊరుకుంటున్నారు. ఫోన్‌పే ద్వారా చెల్లించిన వారిలో టెక్నాలజీ మీద అవగాహన కలిగిన కొద్దిమంది మాత్రం ఆ నంబర్ ఆధారంగా ఏజెంట్ చెప్పిన బ్యాంకు అడ్రస్ తెలుసుకుని వెళ్లి నిలదీస్తే...'మీ ట్రాక్ రికార్డు బాగోలేనందున లోన్ ఇవ్వడానికి ఏ బ్యాంకు ముందుకు రాలేదని, ప్రాసెసింగ్ ఫీజ్ కింద కొంత మినహాయించుకుని మిగిలిన మొత్తం వెనక్కి ఇచ్చేస్తామని' సమాధానం ఇస్తున్నారు. కానీ వారాలు గడిచిపోతున్నా డబ్బులు ఇవ్వడం లేదు. ఇలా నగర పరిధిలోనే కాదు...రాజమండ్రి, భీమవరం, విజయనగరం, శ్రీకాకుళం వంటి పట్టణాల్లో కూడా బాధితులు ఉన్నట్టు సమాచారం. దీనిపై పోలీసులు మేల్కొనకపోతే బాధితుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

160 మంది సచివాలయ కార్యదర్శులకు నోటీసులు

... 5వ పేజీ తరువాయి

నోటీసులు అందించినట్టు జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో పలువురు ఉద్యోగులకు సంబంధించి బయోమెట్రిక్ నమోదు కావడం లేదన్నారు. అలాగే, విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ పరిస్థితుల్లో చర్యల్లో భాగంగా నోటీసులు జారీ చేసినట్టు ఆయన చెప్పారు.

మహిళలతోనే సమాజ పురోభివృద్ధి

- నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ అయ్యనార్
- ఘనంగా మహిళా దినోత్సవం

డాబాగార్డెన్స్, మార్చి 8: మహిళలపైనే సమాజ పురోభివృద్ధి ఆధారపడి ఉంటుందని నగర పోలీస్ కమిషనర్ డా.ఏ రవిశంకర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం కమిషనర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు.పోలీసు శాఖకు చెందిన మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోష్ని అపరంజి కొరాటి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ కే ఫక్కీరప్ప, డీసీపీ-1 వి.ఎన్.మణికంఠ,డీసీపీ పి.వెంకటరత్నం, డీడీఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఎంశైలజా, ఏడీసీపీలు, ఏసీపీలు, మహిళా పోలీసు అధికారులు, వుమెన్ పీసీలు, హెచ్‌సీలు, మహిళా పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం: మహిళా దినోత్సవం రైల్వేన్యూకాలనీలోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శాఖ ఇన్‌చార్జి శశికళ మాట్లాడుతూ స్త్రీ అంటే శక్తి స్వరూపిణి అని అన్నారు. బీజేపీ గ్రేటర్ 42వ వార్డు అధ్యక్షుడు గురుగోవింద్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం టీఎస్ఎన్ కాలనీలో నిర్వహించారు. ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.కార్యక్రమంలో జి.జ్యోతి, జి.శ్రీదేవి, త్రివేణి వర్మ, వరలక్ష్మి, రత్నం తదితరులు పాల్గొన్నారు.టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది జ్యోతిర్మయి, లీలావతి, కుమారి, ధనలక్ష్మి, సీతారత్నం, శాంతి, అనితలను సంస్థ కార్యదర్శి ప్రగడ శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఆధ్వర్యంలో తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేరులో ఉపాధ్యాయినిలకు ప్రిన్సిపాల్ కమల్‌జిత్ సత్కరించారు. రాంజీఎస్టేట్‌లో టీడీపీ నేతయాగాటి ఆదిలక్ష్మి కేక్ కట్ చేశారు.



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు

డాబాగార్డెన్స్: శ్రీ దుర్గ మహిళా చైతన్య సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పి.ఆదినారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం సిటీ సెంట్రల్ పార్కు వద్ద మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కేక్ చేశారు. అనంతరం సీనియర్ కళాకారులను సత్కరించి సన్మానించారు. ప్రెసిడెంట్ బురిడీ లత, కోశాధికారి ఎన్.వెంకటలక్ష్మి, జాయింట్ సెక్రటరీ పార్వతి, సభ్యులు భాను పాల్గొన్నారు.

జ్ఞానాపురం: గ్రేటర్ 41వ వార్డులోని కార్పొరేటర్ కార్యాలయంలో మహిళా దినోత్సవం జరిగింది. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమాను స్థానిక మహిళలు ఘనంగా సత్కరించారు. 33వ వార్డులో వార్డు టీడీపీ నాయకులు విల్లూరి చక్రవర్తి, తిరుమలాదేవి దంపతులు వెంకటేశ్వరమెట్ట వద్ద వేడుకలు నిర్వహించారు. స్థానిక సెయింట్‌జోసెఫ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు లింగసమానత్వం,మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. డా.కె.మాణిక్యకుమారి, డా.జె.నిర్మలపాల్గొన్నారు.

మహిళల్లో రాజకీయ చైతన్యం రావాలి



కేక్ కట్ చేస్తున్న సీపీ రవిశంకర్, కమిషనర్ రోష్ని అపరంజి

సీతమ్మధార: మహిళల్లో రాజకీయ చైతన్యం వస్తేనే సామాజిక, ఆర్థిక రంగల్లో ఎదుగుదల ఉంటుందని రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు పేర్కొన్నారు. అలాగే, దళితులు రాజకీయాల్లోకి ప్రవేశించాలని ఆయన పిలుపునిచ్చారు. రామాటాకీస్ రోడ్డులో అంబేడ్కర్ భవన్‌లో అంబేడ్కర్ మెమోరియాల్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళా సాధికారత, ప్రభుత్వ విధానాలు అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గొల్ల బాబూరావు మాట్లాడుతూ దళితులు, మహిళలు రాజకీయంగా ఎదగాలన్నారు. సొసైటీ అధ్యక్షుడు బికళ్యాణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేవీ ప్రభాకర్, వై.వసంతకుమారి, రత్న కుమారి, గార సత్యనారాయణ, ఆర్.సరస్వతి, శ్రీనివాసరావు, కాంతారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మురళీనగర్; మురళీనగర్ వాకర్స్ అధ్యక్షుడు పల్లా.చంద్రమౌళి ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంచారు. క్లబ్ పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, కమిటీ కార్యదర్శి చెల్వరాజుల చేతుల మీదుగా 40 మందికి చీరలను అందించారు.



మురళీనగరంలో వాకర్స్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ



ఏయూటీడీ వసతి గృహం సిబ్బందికి సత్కారం..



కళాకారులకు సన్మానిస్తున్న దృశ్యం



కేంద్రీయ విద్యాలయంలో ఉపాధ్యాయినిలకు..


తులసీ దళాల నడుమ స్వామివారు

అప్పన్నకు సహస్రనామ తులసీ దళార్చన

సింహాచలం, మార్చి 8 : వరాహలక్ష్మీనృసింహస్వామికి సహస్రనామ తులసీ దళార్చన శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ప్రత్యేక వేదికపై ఉంచి పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర సహస్ర నామావళి పఠిస్తూ తులసీ దళాలతో అర్చన చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై నిత్య కల్యాణం జరిపారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ మార్పు

సింహాచలం, మార్చి 8 : జీవీఎంసీ 98వ వార్డు పరిసర గ్రామాలకు చెందిన రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం సింహాచలం దేవస్థానానికి చెందిన పుష్కరిణి సత్రం ప్రాంగణంలో రిజర్వేషన్ కౌంటర్‌ను ప్రారంభించారు.కౌంటర్‌కు అధికారులు ఊహించిన దానికి మించి డిమాండ్ ఉంది. తాజాగా కేంద్రం ప్రసాద్ పథకంలో భాగంగా పుష్కరిణి సత్రం తొలగించి మల్టీపర్పస్ భవనాన్ని నిర్మించనున్నారు. దీంతో రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను అక్కడి సమీపంలోని టీటీడీలోకి మార్చి, కొత్తగా ప్రారంభించారు.

యోగాతో ఒత్తిడి దూరం

రామ్‌నగర్, మార్చి 8 : నేటి యాంత్రిక జీవనంలో మహిళలు అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారని సహజ యోగా ట్రస్టు రాష్ట్ర ప్రతినిధి పద్మావతి సింహాద్రి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం బీచ్ రోడ్డులోని వైఎంసీఏ వద్ద సహజ యోగా మెడిటేషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అనేక రంగాల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని, ఈనేపథ్యంలో ఒత్తిడిని జయించేందుకు యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు, ఈ కార్యక్రమంలో సుభాషిణి, రామకృష్ణ, రామలక్ష్మి పాల్గొన్నారు.

వంద మందికి వైద్య పరీక్షలు

మధురవాడ, మార్చి 8 : మధురవాడలోని జీవీపీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ కేర్ అండ్ మెడికల్ టెక్నాలజీలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా గాయత్రి ఆస్పత్రిలో మహిళలకు ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వంద మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీవీపీ కార్యదర్శి ఆచార్య పి. సోమరాజు, డీన్ డాక్టర్ ఎస్. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పద్మనాభం, మార్చి 8 : పద్మనాభం పంచాయతీలోని అర్చకునిపాలెంలో బంగారమ్మ ఆలయ ఏడో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతనం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సన్యాసిరావు, రాము, నర్సింహనాయుడు, పైడిరాజు పాల్గొన్నారు.

'మహిళలకు వర్కింగ్ ప్రదేశాల్లో రక్షణ కల్పించాలి'

సిరిపురం, మార్చి 8 : మహిళలకు పని ప్రదేశాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ది ఇండియన్ మహిళా ఫౌండేషన్ సభ్యురాలు జీవీఎల్ పద్మ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ఆడవాళ్లకు ఆడవాళ్లే శత్రువు అన్నట్లు మారిపోయి పని ప్రదేశాల్లో వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని ప్రదేశాల్లో జరుగుతున్న వ్యవహారాలు, ఇతర అంశాలపై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి వాటిని నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **భీమా :** మెలోడి, సంగం, శ్రీరామ, శారద, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-2 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గామి :** జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), గణేష్ (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఇంటి నెం.13 :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **ఆపరేషన్ వాలెంటైన్ :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజవాక)
- **ఊరు పేరు భైరవకోన :** వెంకటేశ్వర, కామేశ్వరి, కన్య-2 (గాజువాక)
- **హనుమాన్ :** లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25,టమాటా 16, వంకాయలు (తెలుపు) 2, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 28, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 24, క్యాబేజ్ 22, క్యారెట్ 24, దొండకాయలు 24, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 42, అల్లం (పాతది) 115, బరబటి 15, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 02, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 54, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	105
ఫారం ధర	--	125
విత్ స్కిన్	--	220
స్కిన్‌లెస్	--	230

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..


ఇసుకతోటలోని వీరభద్రస్వామి ఆలయం వద్ద భక్తులు


ఎంవీపీ కాలనీలోని శివాలయం వద్ద దర్శనం కోసం క్యూలో భక్తులు

మార్మోగిన శివ నామస్మరణ

- వాడవాడలా శివరాత్రి వేడుకలు
- తెల్లవారుజాము నుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- ఇబ్బందులు లేకుండా నిర్వాహకుల ఏర్పాట్లు


ఎండాడలోని పశుపతినాథేశ్వరుడు

భీమునిపట్నం, మార్చి 8 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ మహా శివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భీమిలి పట్టణంలో భ్రమరాంబికా సహిత చోడేశ్వరాలయం , కాత్యాయిని సహిత భీమేశ్వరాలయం, బాలా త్రిపుర సుందరి సహిత చంద్రశేఖరాలయం భక్తులతో కిటకిటలాడాయి. కొత్తపేటలో వున్న పురాతన శివాలయంలోనూ భక్తులు దర్శనానికి బారులు తీరారు. కృష్ణాకాలనీలో వున్న యోగ చైతన్యగిరిలో యోగా మాస్టారు వెంకటరమణ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం నిర్వహించారు. నూకాలమ్మ ఆలయం వీధిలో సిద్ధాంతి సుసరాపు కామేశ్వర మాధవ శాస్త్రి ఆధ్వర్యంలోనూ రుద్రాభిషేకం నిర్వహించారు. కాగా బీచ్‌రోడ్‌లో బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన జలోద్భవ శివలింగ సెంటర్‌ను జడ్జీ కనకమహాలక్ష్మి, సీఐ రమేష్ ప్రారంభించారు. అనంతరం భక్తులు జలోద్భవ శివలింగాన్ని దర్శించుకున్నారు.

జీరుపేట రామాలయంలో...

తగరపువలస : జీరుపేట రామాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు భైటోభజన ఏర్పాటు చేశారు. చిల్లపేటకు చెందిన చిల్ల సూరిబాబు, సరగడ శివాంజనేయరెడ్డి, సరగడ చెన్నారెడ్డి, సూర్యంరెడ్డి, కొల్లి ఎర్రయ్య రెడ్డి, రాకోటి నాగభూషణం, రవ్వ అప్పలనర్సయ్య తదితరులు బృందంగా ఏర్పడి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

మధురవాడలో...

మధురవాడ : మానం ఆంజనేయనగర్‌లో ఉన్న లలిత త్రిపుర సుందరీ దేవి మహా కామేశ్వరస్వామిని అడిషనల్ జిల్లా జడ్జి పి. గోవర్ధన్, పోస్కో కోర్టు ప్రత్యేక జడ్జి జి. ఆనంది, ఎక్సైజ్ సీనియర్ సూపరింటెండెంట్ సింగూరు కొండబాబు, రిటైర్డ్ డీఎస్పీ ప్రసాద్ తదితరులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త సురేష్ వారికి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు.

ప్రత్యేక అలంకరణలో పశుపతినాథేశ్వరుడు

ఎండాడ : జీవీఎంసీ 8, 9 వార్డుల్లోని శివాలయాల్లోనూ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఎండాడలోని పశుపతినాథేశ్వరుని ఆలయంలో సాయంత్రం రుద్రాభిషేకం చేపట్టగా, రాత్రి శివపార్వతుల కల్యాణం జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మాదురాజు ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. అలాగే జోడుగుళ్లపాలెం తీరంలో ఉన్న కొత్తమ్మతల్లి ఆలయ ఆవరణలోని శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. నాగక్షేత్రంలో యోగి ప్రభాకర్‌జీ స్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కాగా శివరాత్రి పురస్కరించుకుని జాగారం చేసిన భక్తులు శనివారం వేకువజాము నుంచి తీరంలో స్నానాలు ఆచరించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. తీరంలో ఎల్‌ఈడీ లైట్లతో పాటు స్నానమాచరించిన భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక టెంట్లు సిద్ధం చేశారు.

నగరపాలెంలో...

భీమునిపట్నం (రూరల్) : నగరపాలెం విశ్వేశ్వరాలయంలో ఉదయం నుంచి పూజలు జరిగాయి. తాటితూరు, నగరపాలెం, గొల్లలపాలెం గ్రామాల నుంచి మహిళలు తరలివచ్చి స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దాకమర్రి, మజ్జివలస గ్రామాల్లో కూడా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిపారు.

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నాలుగో సెక్టరు, ఆరో సెక్టరులోని ఆలయాల్లో తెల్లవారుజాము నాలుగు నుంచి రద్దీ మొదలైంది. ఆరో సెక్టరులోని శివాలయం వద్ద భక్తులు భారీగా క్యూ కట్టారు.

సింహాచలంలో...

సింహాచలం : మహా శివరాత్రి పురస్కరించుకుని వేకువజాము నుంచి సింహగిరి క్షేత్ర పాలకుడి సన్నిధిలో మహాన్యాసపూర్వక ఏకావార రుద్రాభిషేకం, పంచామృతాలు, ఫలరసాలతో అభిషేకాలు చేశారు. అలాగే ప్రధాన రాజగోపురానికి సమీపంలో ఉన్న కాశీవిశ్వేశ్వర పంచాయతన ఆలయంలో కూడా అర్చకులు ప్రత్యేక అభిషేకాలు జరిపారు.కొండదిగువ విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళేశ్వరస్వామి ఆలయం, పాత అడివివరంలోని విశ్వేశ్వరాలయంలో కూడా భక్తుల రద్దీ ఉంది.

వీరభద్రస్వామి ఆలయంలో ...

వెంకోజీపాలెం : ఇసుకతోటలోని వీరభద్రస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తప్పెట గూళ్ళు, కోలాటం, పులివేషాలు, బళ్ల వేషాలతో ఆ ప్రాంతం సందడి నెలకొంది.ఏడాది పొడవునా పిట్ట మనిషి కూడా మెలగని ఈ ఆలయంలో శివరాత్రి రోజున మాత్రమే పూజలు జరపడం విశేషం. కొత్త వెంకోజీపాలెంలోని జ్ఞానానంద ఆశ్రమం, గౌరీ జ్ఞానలింగేశ్వరాలయం, కేఆర్ ఎం కాలనీ, ఇసుకతోట, హెచ్‌బీ కాలనీ శివాలయాల్లోనూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఆరిలోవ : ఆరిలోవలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆలయాల వద్ద బా రులు తీరారు. పెదగదిలిలో కాశీ అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరాలయంలో, ఆరిలోవలోని జ్యోతిర్లింగేశ్వర ఆలయంలోనూ, చినగదిలిలో స్ఫటిక లింగేశ్వర ఆలయంలోనూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పద్మనాభంలో..

పద్మనాభం : పద్మనాభంలోని నారాయణేశ్వరాలయం, రెడ్డిపల్లిలో ఉమారామలింగేశ్వరాలయం, విలాస్‌ఖాన్‌పాలెంలో రామలింగేశ్వరస్వామి ఆలయం, పొట్నూరులో ఉమానీలకంఠేశ్వరాలయం, మద్దిలో కాశీ విశ్వేశ్వరాలయం, తునివలసలో అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర ఆలయం, కుర్రపల్లి శివాలయంలో భక్తు లు పూజలు, అర్చనలు నిర్వహించారు. రెడ్డిపల్లి కృష్ణచంద్ర బాబాజీ మఠం ప్రాంగణంలో ఉత్సవ కమిటీ సభ్యులు మూడు వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో బాలవికాస్ విద్యార్థులు శివనామ స్తోత్రాల పారాయణం చేశారు.

పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం

కోరాడ పంచాయతీ గెద్దపేట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సహిత లక్ష్మీగణపతి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో వేద పండితులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మద్దిలో రామకోటి ఆశ్రమం సమీపంలో ఉన్న కాశీవిశ్వేశ్వర ఆలయంలోనూ పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు.

సముద్ర స్నానాలకు ఏర్పాట్లు

భీమునిపట్నం : నదీ సంగమ స్నానాలకు వచ్చే భక్తులకు సౌకర్యంగా జీవీఎంసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. బీచ్‌లో బారికేడ్లు, ఫ్లడ్ లైట్లు, మహిళల డ్రస్ చేంజింగ్ గదులు, మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. అలాగే సీఐ రమేష్ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.


మానంఆంజనేయనగర్‌లో ఆలయం వద్ద జిల్లా న్యాయమూర్తులు


గెద్దపేటలో పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం


భీమిలిలో జలోద్భవ శివలింగ దర్శనానికి భక్తుల రద్దీ


భీమిలి : యోగా చైతన్య గిరిలో రుద్రాభిషేకం

దేశాభివృద్ధికి మహిళా శక్తి అవసరం

మహిళా దినోత్సవం వేడుకల్లో వక్తలు

సాగర్‌నగర్, మార్చి 8 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గీతంలోని వివిధ విభాగాలకు చెందిన మహిళలు,విద్యార్థులు, అధ్యాపకులు హెల్త్ వాక్ చేశారు.అలాగే పలు సంస్థల్లో పనిచేస్తున్న గీతం పూర్వ విద్యార్థులు ముఖ్యంగా మహిళలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహిళా సాధికారతపై వివిధ రంగాలకు చెందిన నిపుణులతో చర్చ ఏర్పాటు చేయడంతో పాటు మహిళల చేతి వృత్తుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి, మహిళా సాధికార విభాగం ఛైర్‌పర్సన్ డాక్టర్ వీబీ శ్రీవిద్య, స్టూడెంట్ లైఫ్ డీన్ డాక్టర్ బాలాకుమార్ పాల్గొన్నారు.

అప్పుఘర్‌లో..

ఎంవీపీ కాలనీ : అప్పుఘర్ సమీపంలోని ఫిషర్‌మెన్ కాలనీలో లయన్స్ క్లబ్ ఆఫ్ విశాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు,18 వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి చేతుల మీదుగా 30 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. అనంతరం కార్పొరేటర్ మంగవేణిని సన్మానించారు. లయన్స్ క్లబ్, స్వయం కృషి వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు సూర్య ప్రకాష్, సుధాకరరావు, దుర్గా ఆనంద్, మహేష్, నాయుడు, మాణిక్యాలరావు, ధనలక్ష్మి పాల్గొన్నారు.


మహిళలు అప్రమత్తంగా ఉండాలి

ఆనందపురం : వేములవలస కూడలిలోని ఆర్ ఎంపీ ఉత్తరాంధ్ర జోనల్ కార్యాలయంలో ఆర్‌ఎంపీ మహిళా సంఘం ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. జోనల్ మహిళా కార్యదర్శి ఎస్.సుగుణేశ్వరి, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి, అవంతి కంప్యూటర్స్ డైరెక్టర్ కోన ప్రకాష్ కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర మహిళా సంఘం సభ్యులు భవాని, అను, కళ, అన్నపూర్ణ, రేవతి, విజయలక్ష్మి, సీతారత్నం, మేఘన, గయా రాధిక పాల్గొన్నారు.


ఫిషర్‌మెన్ కాలనీలో జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న వెలగపూడి

త్వరలో మహిళాభ్యుదయ ప్రభుత్వం

మద్దిలపాలెం : రాష్ట్రంలో త్వరలోనే మహిళాభ్యుదయ ప్రభుత్వం ఏర్పాటు కానుందని జనసేన నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శివాజీపాలెంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు భద్రత లేకుండాపోయిందన్నారు. టీడీపీ, జనసేన ప్రభుత్వంలో మహిళలకు భద్రతతో పాటు సమాజంలో గౌరవ స్థానం కల్పిస్తామన్నారు. అనంతరం వివిధ రంగాల్లోని మహిళలను సన్మానించి జ్ఞాపికలు అందిం చారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్, బొలిశెట్టి సత్య, పసుపులేటి ఉషాకిరణ్, భీశెట్టి వసంతలక్ష్మి, రేవతి పాల్గొన్నారు.


గీతంలో జరిగిన వేడుకల్లో ఆచార్యులు

పద్మనాభం (రూరల్) : మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని భీమిలి ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ గొర్రిపాటి పెద ఎర్రినాయుడు అన్నారు. అనంతవరంలో జరిగిన వేడుకల్లో వార్డు మెంబర్ రమణమ్మను సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

టీడీపీ పాలనలో సముచిత స్థానం

సాగర్‌నగర్ : మహిళలకు సమాన హక్కు కల్పించింది టీడీపీ అని ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు ఎస్. అనంతలక్ష్మి అన్నారు. టీడీపీ విశాఖ పార్లమెంట్ మహిళా కమిటి అధికార ప్రతినిధి శతపతి మంగాదేవి ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో వేడుకలు నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారతకు దివంగత ఎన్టీఆర్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో కృషి చేసారన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్లు, ఆర్‌పీలను సన్మానించారు.

జనసేన కార్యాలయంలో..

ఎండాడ : ఎండాడలో ఉన్న భీమిలి నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ 8వ వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పార్టీ భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త పంచకర్ల సందీప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వీర మహిళలు, తదితరులుపాల్గొన్నారు.


శివాజీపాలెంలోని జనసేన కార్యాలయంలో మహిళలను సన్మానించిన వంశీకృష్ణ


టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కోరాడ రాజబాబు


సీఐ కల్యాణిని సత్కరిస్తున్న సీపీ రవిశంకర్, జాయింట్ సీపీ ఫక్కీరప్ప

దిశా పీఎస్ సీఐని సన్మానించిన సీపీ

ఎండాడ, మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎండాడలో ఉన్న దిశా మహిళా పోలీసు స్టేషన్ సీఐ టి. కల్యాణిని సీపీ రవిశంకర్, జాయింట్ సీపీ ఫక్కీరప్ప శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల మహారాష్ట్రలోని నాగపూర్‌లో నిర్వహించిన 72వ ఆలిండియా యోగా పోటీల్లో ఆమె ప్రతిభ చూపి సిల్వర్ మెడల్ సాధించడంతో సన్మానించి, నగదు బహుమతి అందించారు.

సుదర్శన యజ్ఞానికి అశోక్ గజపతిరాజుకు ఆహ్వానం


యజ్ఞం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అశోక్‌గజపతిరాజు

సింహాచలం, మార్చి 8 : సింహగిరిపై ఈనెల 26 నుంచి జరిగే సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో పాల్గొనాలని కోరుతూ ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజుకు అధికారులు శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈమేరకు వారు విజయనగరంలో అశోక్‌ను కలిసారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు,అశోక్‌కు ఆశీర్వచనాలను ఇవ్వగా.. దేవస్థానం ఈఓ సింగల శ్రీనివాసమూర్తి ఆహ్వాన పత్రికను అందజేసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. అనంతరం శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వాహక ఇంజినీర్లు దండు గణశ్రీనివాసరాజు, బండారు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో శ్రవణ నక్షత్ర హవనం

సింహాచలం, మార్చి 8 : కొండదిగువన అప్పన్న ఉద్యానవనంలో ఉన్న పద్మావతి, అలిమేల్‌మంగా సమేత వెంకటేశ్వరస్వామి సన్నిధిలో శ్రవణ నక్షత్రం పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక హవనం నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు జరిపారు. యజ్ఞమూర్తిగా సుదర్శన పెరుమాళ్‌ను ముందుగా అలంకరించి వేదికపై ఉంచారు. ఆగమశాస్త్ర విధానంలో బింబారాధన, కుంభారాధన, కలశారాధన చేసి హోమకుండంలో అగ్నిప్రతిష్ఠాపన జరిపారు. తొలుత పంచసూక్తాలతో తరువాత సుదర్శన మూల, మూర్తి మంత్రాలతో హవనాన్ని జరిపారు. మహా పూర్ణాహుతి జరిపి పూర్ణ కలశాన్ని అంతరాలయంలో స్వామివారి చెంత ఉంచి పూజలు చేశారు. కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జాతీయ స్థాయిలో గీతం విద్యార్థుల ప్రతిభ



నగదు బహుమతి అందుకుంటున్న గీతం విద్యార్థులు

సాగర్‌నగర్, మార్చి 8 : ప్రముఖ ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) దేశంలోని ఇంజనీరింగ్ విద్యార్థుల్లో సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలను వెలికి తీసి ప్రోత్సహించడానికి జాతీయ స్థాయిలో ఇటీవల హ్యాక్‌క్వెస్ట్ - 2024 పోటీలు నిర్వహించింది. ఇందులో గీతం విద్యార్థులు సత్తా చూపారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఆవుల సత్య ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్ ట్రోఫీతో పాటు రూ 1. 2 లక్షల నగదు బహుమతి అందుకోగా జి. సాయితేజ తృతీయ స్థానంలో నిలిచి రూ. 70 వేల నగదు బహుమతి పొందారు. వారు అప్లికేషన్ సెక్యూరిటీ, నెట్‌వర్క్ సెక్యూరిటీ, డిజిటల్ ఫోరెన్ సిక్స్, ఎథికల్ హ్యాకింగ్, మాల్ వేర్ ఎనాలసిస్, రివర్స్ ఇంజనీరింగ్, జావా, పైథాన్ తదితర అంశాల్లో ప్రతిభ చూపారు. విజేతలను గీతం కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ వంశీకిరణ్ సోమయాజులు, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ ఆర్.శిరీష, డైరెక్టర్ ప్రొఫెసర్ నాగేంద్రప్రసాద్, తదితరులు అభినందించారు.

హిందూ ధార్మిక సంఘాల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు

విశాలాక్షినగర్, మార్చి 8 : నాగ క్షేత్రంలో శివలింగాన్ని బూటు కాలితో తన్నిన అటవీ శాఖ ఉద్యోగి చిట్టిబాబును తక్షణమే సస్పెండ్ చేయాలని టీడీపీ నాయకుడు ఆడారి కిషోర్ డిమాండ్ చేశారు. బీచ్ రోడ్డులోని నాగక్షేత్రం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులతో కలిసి ఆయన శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 ఏళ్లుగా ఇదే ప్రాంగణంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా ఆశ్రమంలో శివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది ఫారెస్టు అధికారులు వ్యవహరించడం తీరు ఆక్షేపనీయమన్నారు. బీజేపీ రాష్ట్ర ధార్మిక సెల్ కో కన్వీనర్ విజయ్ ఫణి మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్యమత శక్తులు పేట్రేగిపోతున్నాయని, హిందూ వ్యతిరేక ఉద్యోగులను హిందూ దేవాలయాల పైకి ఉసిగొల్పి మత కల్లోలాలు రేకెత్తించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర మఠమందిర్ టోలిపూడి పెద్దిశర్మ మాట్లాడుతూ కోట్లాది మంది హిందువుల మనోభావాలను కించపర్చేవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా సెల్ కో కన్వీనర్ డీఎస్ వర్మ, బీజేపీ నగర ఉపాధ్యక్షుడు కలిగట్ల సుబ్రహ్మణ్యం, నగర కార్యదర్శి పొలిమేర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై యువతకు అవగాహన

పద్మనాభం (రూరల్), మార్చి 8 : యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కాళ్ల నగేష్‌కుమార్ కోరారు. శుక్రవారం ఆయన మద్ది, తునిపొలం గ్రామాల్లో ఓటు హక్కుపై యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలు కలుషితమయ్యాయని, గుండాలు, హంతకులు రాజకీయాల్లోకి వస్తున్నారని చెప్పారు. వారికి అడ్డుకట్ట వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలంటే యువత ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

బాల పేరంటాలకు మాజీ మంత్రి గంటా పూజలు


బాలపేరంటాలను దర్శించుకున్న గంటా

భీమునిపట్నం, మార్చి 8 : పట్టణంలోని డచ్ రోడ్డులో వున్న కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఛైర్మన్ శ్రీరామచంద్రమూర్తి నివాసం వద్ద బాల పేరంటాలమ్మకు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు శుక్రవారం పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే మహిళలకు చీరలు, పురుషులకు స్టీల్ బాక్స్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంటా నూకరాజు, ఎస్. అప్పారావు, కొక్కిరి అప్పన్న, కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ప్రతినిధులు కె. రమణమ్మ, కె. పద్మజ, అనురాధ, భానోజీరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.